

ఎన్నికల బహిష్కరణకు 'తాడి' గ్రామస్థుల తీర్మానం

ఫార్మా కాలుష్యం నుంచి గ్రామానికి విముక్తి కల్పిస్తామన్న జగన్మోహన్‌రెడ్డి హామీ నెరవేరలేదంటున్న గ్రామస్థులు

- అయోధ్య రామిరెడ్డి అధికారాన్ని అడ్డం పెట్టుకుని చట్టాలను ఉల్లంఘిస్తున్నారని ఆరోపణ
- గ్రామం తరలింపునకు జిల్లా యంత్రాంగం చొరవ తీసుకోవాలని డిమాండ్

- వార్త మెయిన్‌లో..

నీటి ప్రాజెక్టులను గాలికొదిలేశారు!



'ఉత్తరాంధ్ర సుజల స్రవంతి'కి ఉత్తుత్తి కేటాయింపులు



పద్మనాభం మండలం రేవిడి గ్రామంలో సగంలో నిలిచిన యూనాద్రి చెరువు పనులు

- ఐదేళ్లలో పైసా విదల్చని జగన్ సర్కారు
- తాండవ రిజర్వాయర్ ఆధునికీకరణ, నిర్వహణపై నిర్లక్ష్యం
- బడ్జెట్‌లో చూపిన నిధులే విడుదల చేయని ప్రభుత్వం
- రైవాడపైనా చిన్నచూపు
- జపాన్ రుణం ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వ వాటా
- 15 శాతం జమ చేయకపోవడంతో నిలిచిపోయిన ఆధునికీకరణ పనులు
- చిన్న చెరువుల పునరుద్ధరణపై అశ్రద్ధ
- ప్రపంచబ్యాంకు నుంచి 70 శాతం నిధులు
- కేవలం 30 శాతం సమకూర్చలేకపోయిన వైసీపీ ప్రభుత్వం
- నిలిచిపోయిన పనులు

దేవరాపల్లి మండలంలో సగంలో నిలిచిన రైవాడ ప్రధాన కాలువ పనులు

విశాఖపట్నం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): **వైసీపీ ప్రభుత్వం నీటి పారుదల రంగాన్ని గాలికొదిలేసింది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో గత ఐదేళ్లలో కొత్తగా ఒక ప్రాజెక్టు చేపట్టలేదు సరికదా...ఉన్న ప్రాజెక్టుల నిర్వహణను కూడా పట్టించుకోలేదు. చివరకు జపాన్, ప్రపంచ బ్యాంకు సాయం/రుణంతో చేపట్టదలచిన పనులకు రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులు ఇవ్వకపోవడంతో అవి కూడా అటకెక్కాయి. వచ్చే వర్షాకాలం నాటికి ప్రతి ప్రాజెక్టుకు మరమ్మతులు చేయాల్సి ఉండగా...కొత్తగా ప్రతిపాదనలు పంపొద్దంటూ ఉన్నతాధికారులు చెబుతున్నారు.**

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు తొలి దశలో ఉమ్మడి జిల్లాలో 1.3 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని ప్రతిపాదించారు. వైసీపీ ప్రభుత్వం సుజల స్రవంతి ప్రాజెక్టుకు 2019-20 బడ్జెట్‌లో రూ.170.06 కోట్లు, 2020-21 బడ్జెట్‌లో రూ.107.96 కోట్లు, 2021-22లో రూ.97.75 కోట్లు, 2022-23లో రూ.297.5 కోట్లు, 2023-24 బడ్జెట్‌లో రూ.141.79 కోట్లు కేటాయించింది. కానీ, గడచిన ఐదేళ్లలో ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. చంద్రబాబునాయుడు హయాంలో 2018లో కాంట్రాక్టరుకు రూ.12.8 కోట్ల మొబిలైజేషన్ అడ్వాన్స్ ఇచ్చారు. అవి తప్ప వైసీపీ ప్రభుత్వం ఎటువంటి చెల్లింపులు జరపలేదు. గతంలో చేసిన పనులకు సంబంధించి రూ.8 కోట్ల వరకూ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రజా ప్రతినిధుల ఒత్తిడి మేరకు వైసీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు అంచనాను మూడేళ్ల క్రితం రూ.17,050.20 కోట్లకు సవరించి ఆమోదించింది. రెండో దశలో పనులను ఆరు ప్యాకేజీలుగా విభజించి దాంట్లో రెండింటికి రూ.3,800 కోట్లతో టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు అప్పగించారు.

దీనికితోడు కాల్వల తవ్వకానికి భూసేకరణ పూర్తిచేసి నోటిఫికేషన్ ప్రకటించిన అధికారులు, నిధులు విడుదలైతే అవార్డు వివరాలు విడుదలకు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికిప్పుడు ప్రాజెక్టును యుద్ధప్రాతిపదికగా చేపట్టినా పూర్తిచేయాలంటే కనీసం ఐదు నుంచి ఎనిమిదేళ్ల సమయం పడుతుందని రిటైర్డు ఇంజనీరు ఒకరు వ్యాఖ్యానించారు. తాజా అంచనా మేరకు ప్రాజెక్టు వ్యయం రూ.20 వేల కోట్లకు చేరుకుంటుందని చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో తాండవ, కోనాం, పెద్దేరు, రైవాడ, వరహా నీటి ప్రాజెక్టుల నిర్వహణకు గడచిన ఐదేళ్లలో అత్యంత తక్కువ మొత్తంలో నిధులు ఖర్చుచేశారు. వీటిలో కొన్ని ప్రాజెక్టులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించినా సొమ్ములు విడుదలకు వచ్చేసరికి మరీ తక్కువ వచ్చాయి. దీంతో ప్రాజెక్టుల నిర్వహణ చేపట్టిన ఖర్చులు చాలా వరకు బకాయిపడ్డారు.

ఉమ్మడి విశాఖ, తూర్పుగోదావరి జిల్లాలకు నీటి సరఫరా చేసే తాండవ రిజర్వాయర్ నిర్వహణ, ఆధునికీకరణపై తీవ్ర నిర్లక్ష్యం చూపారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత తొలిసారిగా 2020-21లో రూ.80.91 లక్షలు, 2021-22లో రూ.99.8 లక్షలు, 2022-23లో 89.93 లక్షలు బడ్జెట్‌లో కేటాయించినా రూపాయి విడుదల చేయలేదు. గత ఏడాది మార్చిలో నిర్వహణ, మరమ్మతులకు రూ.ఆరు కోట్లు కేటాయించినా ఇంతవరకూ కాంట్రాక్టర్లు ఎవరు ముందుకురాలేదు. అయితే ఈ నిధులు కూడా విడుదల కాలేదు. కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కింద సుమారు రూ.3.5 కోట్లు పనులకు నాలుగేళ్ల క్రితం ఆమోదం తెలిపారు. వాటిలో రూ.2 కోట్ల బిల్లులు కాగా మరో రూ.1.5 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. డ్యామ్ నిర్వహణ బిల్లులు చాలా వరకు చెల్లించాల్సి ఉంది.

రైవాడ రిజర్వాయర్ నిర్వహణ, మరమ్మతులకు 2021-22 బడ్జెట్‌లో రూ.9.28 లక్షలు, 2022-23లో రూ.171.75 లక్షలు కేటాయించినా పైసా విడుదల చేయలేదు. జపాన్ రుణం రూ.30.43 కోట్లతో ప్రాజెక్టు ఆధునికీకరణ పనులు చేపట్టారు. ఇప్పటివరకూ రూ.4.17 కోట్లు ఖర్చు చేయగా రూ.2.88 కోట్లు బిల్లులు మంజూరుచేశారు. మిగిలిన మొత్తం విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్ తట్టాబుట్టా సర్దుకుని వెళ్లిపోయారు. ప్రాజెక్టు వ్యయంలో 85 శాతం జపాన్ విడుదల చేస్తే రాష్ట్ర ... మిగతా 8వ పేజీలో

లోక్‌సభ పోరు రసవత్తరం

కూటమి తరపున బీజేపీ అభ్యర్థిగా సీఎం రమేశ్, వైసీపీ నుంచి బూడి ముత్యాలనాయుడు బరిలో ఉండడంతో హోరాహోరీ

- వ్యూహ, ప్రతి వ్యూహాల్లో ప్రధాన పార్టీలు



సీఎం రమేశ్, బీజేపీ అభ్యర్థి



బూడి ముత్యాలనాయుడు, వైసీపీ అభ్యర్థి

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి) **అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పోరు హోరాహోరీగా ఉంది. కూటమి తరపున బీజేపీ లోక్‌సభ అభ్యర్థిగా సీఎం రమేశ్, వైసీపీ నుంచి ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు బరిలో ఉండడంతో రసవత్తరంగా మారింది. హేమాహేమీలు పోటీ పడుతుండడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది.**

అనకాపల్లి లోక్‌సభ నియోజకవర్గంలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. అనకాపల్లి, నర్సీపట్నం, చోడవరం, పాయకరావుపేట, ఎలమంచిలి, మాడుగుల, పెందుర్తి పరిధిలో పరవాడ, సబ్బవరం మండలాలు ఈ పరిధి లోకి వస్తాయి. 1962లో ఏర్పడిన ఈ లోక్‌సభ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 15 పర్యాయాలు ఎన్నికలు జరగగా, 9 సార్లు కాంగ్రెస్, 5 సార్లు తెలుగుదేశం, ఒకసారి వైసీపీ విజయం సాధించాయి.

మొదలైన ఎన్నికల వేడి

కూటమి తరపున బీజేపీ అభ్యర్థిగా సీఎం రమేశ్, వైసీపీ అభ్యర్థిగా బూడి ముత్యాలనాయుడు పేర్లు ప్రకటించడంతో ఎన్నికల వేడి మొదలైంది. గత ఎన్నికల్లో వైసీపీ చేజిక్కించుకున్న ఈ స్థానంలో పాగా వేయాలని కూటమి ప్రయత్నిస్తుండగా, ఈ పోరులో ఎలాగైనా తమ సీటు పదిలం చేసుకోవాలని వైసీపీ ఎత్తులు వేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా 24 లోక్‌సభ అభ్యర్థులను ప్రకటించిన వైసీపీ అనకాపల్లి స్థానానికి అభ్యర్థిని ప్రకటించకుండా వేచి చూసింది. కూటమి అభ్యర్థిగా సీఎం రమేశ్ పోటీ చేస్తున్నారని ప్రకటన వెలువడడంతో ఉప ముఖ్యమంత్రి, మాడుగుల ఎమ్మెల్యే బూడి ముత్యాలనాయుడును బరి లోకి దించింది. ఈ క్రమంలో ఇరు పార్టీల నాయకులు నియోజకవర్గాల ముఖ్య నాయకులతో సమావేశమవుతున్నారు. ఎన్నికల ప్రచారం, అనుసరించాల్సిన వ్యూహాలను రచిస్తున్నారు. గెలుపు కోసం సర్వశక్తులు ఒడ్డేందుకు వైసీపీ ప్రయత్నిస్తోంది. అయితే వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజల్లో వ్యతిరేకత తమకు కలిసొచ్చే అంశాలను కూటమి నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

హాట్‌కేకుల్లా అమ్ముడైన ఐపీఎల్ టికెట్లు

చెన్నై సూపర్‌కింగ్, ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్ టికెట్లు

- అమ్మకాలు ప్రారంభించిన రెండు గంటల్లో సోల్డ్ అవుట్
- మధ్యాహ్నం 12.30 గంటలకే అయిపోయిన రూ.1,000, రూ.1,500, రూ.3,000, రూ.4,000 టికెట్లు
- మిగిలిన ధరల టికెట్ల అమ్మకాలపై స్పష్టత నిల్

విశాఖపట్నం (స్పోర్ట్సు), మార్చి 27: ఢిల్లీ క్యాపిటల్స్, చెన్నై సూపర్‌కింగ్స్ మధ్య ఈనెల 31న నగరంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరగనున్న ఐపీఎల్ మ్యాచ్‌కు సంబంధించిన టికెట్లు దాదాపు అయిపోయాయి. పేటీఎం ఇన్‌సైడర్ ద్వారా బుధవారం టికెట్ల అమ్మకం ప్రారంభించగా క్రీడాభిమానుల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. ఉదయం పది గంటలకు అమ్మకాలు ప్రారంభించగా...సెకన్లలోనే 70 వేలకు మందికిపైగా లాగిన్ అయ్యారు. విక్రయం ప్రారంచించిన రెండు గంటల్లోనే రూ.1,000, రూ.1,500, రూ.3,000, రూ.4,000 టికెట్లు అయిపోయాయి. మధ్యాహ్నం 12.30 గంటలకు రూ.1,000, రూ.1,500, రూ.3,000, రూ.4,000 టికెట్లు అమ్ముడైపోయాయని ప్రకటిస్తూ క్లోజ్ చేశారు. అయితే రూ.2,000, రూ.2,500, రూ.3,500, రూ.5,000 టికెట్లపై స్పష్టత లేదు. మిగిలిన టికెట్ల అమ్మకాలు గురువారం చేపడుతున్నదీ లేనిదీ కూడా నిర్వాహకులు ప్రకటించలేదు.

ఈ మ్యాచ్ కాకపోతే ఆ మ్యాచ్...

చెన్నై సూపర్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్ టికెట్లు దొరక్కపోవడంతో కొందరు ఏప్రిల్ 3వ తేదీన కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగే మ్యాచ్ టికెట్లు తీసుకున్నారు. దీంతో బుధవారం రాత్రి సమయానికి రూ.1,000, రూ.1,500, రూ.2,000 టికెట్లు అమ్ముడైపోయాయి. రూ.2500, రూ.3000, రూ.3500, రూ.5000 ధర టికెట్లు అందుబాటులో ఉన్నాయి.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (గురు)	6.13
సహరి (శుక్ర)	4.41

పట్నం రహదారి విస్తరణ అస్తవ్యస్తం



నర్సీపట్నం మెయిన్ రోడ్డు

గత ఏడాది జూలైలో పనులు ప్రారంభం

- తొలుత మెయిన్‌రోడ్డు వంద అడుగులకు విస్తరణ చేయాలని నిర్ణయం
- పలువురు అభ్యంతరం తెలపడంతో 90 అడుగులకు కుదింపు
- హైకోర్టును ఆశ్రయించిన సుమారు 90 మంది భవన యజమానులు
- కాంట్రాక్టరుకు బిల్లులు మంజూరు కాకపోవడంతో పనుల్లో జాప్యం
- పట్టణ వాసులకు తప్పని ట్రాఫిక్ కష్టాలు



డ్రైనేజీ పనులు నిలిచిపోయిన దృశ్యం

నర్సీపట్నం, మార్చి 27: **మెయిన్ రోడ్డు విస్తరణతో ట్రాఫిక్ కష్టాలు తీరతాయని భావించిన పట్టణ వాసులకు నిరాశే మిగిలింది. ఈ పనులు నత్తనడకన సాగుతుండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. కాంట్రాక్టరుకు వైసీపీ ప్రభుత్వం సకాలంలో బిల్లులు మంజూరు చేయకపోవడమే పనుల జాప్యానికి కారణమని తెలుస్తోంది.**

మెయిన్ రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులకు 2022 డిసెంబరు 30వ తేదీన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అబీద్ సెంటర్ నుంచి పెదబొడ్డేపల్లి మదుం వరకు 1.5 కిలోమీటర్ల మేర 100 అడుగుల మెయిన్ రోడ్డు విస్తరణ, అభివృద్ధి, సెంటర్ డివైడర్, డ్రైనేజీ పనులకు రూ.10.6 కోట్లు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. గత ఏడాది జూలై 21న ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ భూమి పూజ చేసి రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించారు.

ఆది నుంచి ఆటంకాలే..

అబీద్ సెంటర్ నుంచి పెదబొడ్డేపల్లి మదుం వరకు మెయిన్ రోడ్డుకి ఇరువైపులా ప్రైవేటు ఆస్తులు 221, ప్రభుత్వ ఆస్తులు 12 ఉన్నాయి. తొలుత 100 అడుగుల రోడ్డు విస్తరణ, పరిహారంగా టీడీఆర్ బాండ్లు ఇవ్వడానికి భవన యజమానులను ఒప్పించే ప్రయత్నం చేశారు. ఈ ప్రతిపాదనకు భవన యజమానులు ససేమిరా అన్నారు. రోడ్డు విస్తరణ 80 అడుగులు చేసి టీడీఆర్ కి బదులు భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారంగా నగదు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో ఎమ్మెల్యే పది అడుగులు తగ్గించి 90 అడుగులు రోడ్డు విస్తరణ చేయడానికి నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రతిపాదనను 100 మందికి పైగా భవన యజమానులు అంగీకరించారు. మిగిలిన భవన యజమానులు కోర్టును ఆశ్రయించాలని నిర్ణయం తీసుకున్నారు. మునిసిపల్ కమిషనర్ ఇచ్చిన కూల్చివేత నోటీసులపై సుమారు 90 మంది హైకోర్టును ఆశ్రయించారు. కూల్చివేత నోటీసులపై హైకోర్టు స్టే విధించింది. మిగిలిన రోడ్డు విస్తరణ పనులు చట్ట పరిధిలో చేసుకోవచ్చునని సూచించింది. దీంతో ముందుగా ప్రభుత్వ ఆస్తులు, ఆక్రమణలు కూల్చాలని మునిసిపల్, రెవెన్యూ అధికారులు నిర్ణయించారు. గత సంవత్సరం జూలై 21వ తేదీన ఎమ్మెల్యే భూమి పూజ చేసి రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించగా, అబీద్ సెంటర్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ఉన్న ప్రభుత్వ ఆస్తులను ఎక్స్‌కవేటర్ల సహాయంతో కూల్చివేశారు. కాగా ప్రభుత్వ ఆస్తులు ... మిగతా 8వ పేజీలో

ధ్రువ పత్రాల జారీకి బ్రేక్

పది రోజులుగా సచివాలయాల్లో సర్టిఫికెట్ల ప్రక్రియ నిలిపివేత

- అన్నింటిపై సీఎం జగన్ ఫొటో ఉండడమే కారణం
- ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నిర్ణయం
- రైతులు, విద్యార్థుల అవస్థలు



గతంలో సీఎం జగన్ ఫొటోతో జారీ చేసిన 1బీ పత్రం

రోలుగుంట, మార్చి 27: ప్రభుత్వం జారీ చేసే అన్ని సర్టిఫికెట్లపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఫొటో ఉండడం విద్యార్థులు, రైతులకు ఇబ్బం దులు తెచ్చి పెట్టింది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో తహసీల్దార్ కార్యాలయాల ద్వారా జారీ చేసే ధ్రువ పత్రాలు, పట్టాదారు పాస్ పుస్తకాలపై సీఎం ఫొటోలు ఉంటే వాటి జారీని నిలిపివేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. దీంతో ఈ నెల 18వ తేదీ నుంచి సచివాలయాలు, మీసేవా కేంద్రాల నుంచి సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ నిలిచిపోయింది. గత పది రోజులుగా బ్యాంకుల్లో రుణాలు తెచ్చుకోవడానికి గాని, రెన్యువల్ చేసుకోవడానికి గాని, రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవడం గాని జరగకపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. అలాగే విద్యార్థులకు సర్టిఫికెట్లు జారీ కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. దీనిపై మండల ఈవోఆర్డీవో నూకరాజును వివరణ కోరగా అన్ని సచివాలయాల్లో సర్టిఫికెట్ల జారీని నిలిపివేశామన్నారు. సీఎం జగన్ ఫొటో లేని సర్టిఫికెట్లు రెండు, మూడు రోజుల్లో వస్తాయని చెప్పారు.

వారం రోజులుగా తిరుగుతున్నా..



బ్యాంకులో రుణం రెన్యువల్ చేయడానికి 1బీ కోసం వారం రోజులుగా తిరుగుతున్నాను, మీసేవా, సచివాలయాలకు 1బీ కోసం వెళితే సర్టిఫికెట్ల జారీ నిలిపివేశామని, సీఎం జగన్ ఫొటో లేని సర్టిఫికెట్లు త్వరలో వస్తాయని చెబుతున్నారు. లోన్ రెన్యువల్ చేయకపోతే వడ్డీ పడిపోతుంది. - బలిజి జగన్నాథరావు, గుండుబాడు

రైలు ప్రయాణికుల పాట్లు

అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో తరచూ మొరాయిస్తున్న ఎస్కలేటర్

- పట్టాలు దాటుకుంటూ ప్లాట్‌ఫారాలకు చేరాల్సిన దుస్థితి
- మరమ్మతుల గురించి పట్టించుకోని అధికారులు



టికెట్ బుకింగ్ ఆఫీస్ వైపు పని చేయని ఎస్కలేటర్



ప్లాట్‌ఫారాలకు వెళ్లడానికి మెట్లు ఎక్కుతున్న ప్రయాణికులు

అనకాపల్లి టౌన్, మార్చి 27: స్థానిక రైల్వేస్టేషన్‌లో టికెట్ బుకింగ్ కౌంటర్ వద్ద ఉన్న ఎస్కలేటర్ నిరుపయోగంగా మారింది. గత కొద్ది రోజులుగా ఇది పనిచేయకపోవడంతో రెండు, మూడు ప్లాట్‌ఫారాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఎస్కలేటర్ అందుబాటులో లేకపోవడంతో వృద్ధులు, దివ్యాంగులు గూడ్స్‌షెడ్ వైపు ఉన్న కాలిబాట మీదుగా పట్టాలు దాటు కుని ప్లాట్‌ఫారాలకు వెళ్లాల్సి వస్తున్నది. కాగా టికెట్ బుకింగ్ కౌంటర్ వద్ద వున్న ఎస్కలేటర్ తరచూ మరమ్మతులకు గురవుతున్నది. రైల్వే అధికారులు కూడా మరమ్మతులు చేయించక పోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. నిత్యం వేలాది మంది ప్రయాణికులు టికెట్ బుకింగ్ కౌంటర్ నుంచి రైలు పట్టాల మీదుగా నడుచుకుంటూ రెండు, మూడు ప్లాట్‌ఫారాలకు వెళ్లి ఇటు విశాఖ, అటు విజయవాడ వైపు రాకపోకలు సాగిస్తున్నారు. దీనిపై రైల్వే స్టేషన్‌అధికారులను వివరణ కోరగా... ఎస్కలేటర్‌ను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నారు.

క్రైం... crime news

చికిత్స పొందుతూ కార్మికుడి మృతి

రాంబిల్లి, మార్చి 27: ఎస్‌ఈజెడ్‌లోని సింబయో జనరిక్స్ ఫార్మా కంపెనీల్లో ఈనెల 14 వ తేదీన జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి విశాఖలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని పెదకలవలాపల్లికి చెందిన కలవలపల్లి నరసింగరావు(47) మంగళవారం రాత్రి మృతి చెందినట్టు సీఐ లక్ష్మణరావు తెలిపారు. విశాఖ కేజీహెచ్‌లో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించామన్నారు. ఈ ప్రమాదంలో ముగ్గురు కార్మికులు గాయపడ్డారని, వీరిలో చోడవరం మండలం గోవాడకి చెందిన ఎ.రాము ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈనెల 24న మృతి చెందగా, నరసింగరావు 26న రాత్రి మృతి చెందాడన్నారు. రాంబిల్లి మండలం మర్రిపాలెంకు చెందిన అమలుకంటి సన్యాసిరావు అనే మరో కార్మికుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు. నరసింగరావు కుటుంబాన్ని ఆదుకోవాలని సింబయో కంపెనీ ప్రతినిధులతో చర్చలు జరిపినట్టు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు జి.దేముడునాయుడు తెలిపారు. కంపెనీ నుంచి రూ.20 లక్షలు, కాంట్రాక్టర్ నుంచి రూ2.75 లక్షలు నరసింగరావు కుటుంబానికి ఇవ్వడానికి ఒప్పందం కుదిరిందన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు..

నర్సీపట్నం, మార్చి 27: మునిసిపాలిటీ పరిధి సుబ్బారాయుడుపాలెం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనకు సంబంధించి పట్టణ ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు తెలిపిన వివరాలివి. మాకవరపాలెం మండలం తామరం గ్రామానికి చెందిన మంత్రి వెంకట రత్నకుమారి (66) మంగళవారం ఎస్.రాయవరం మండలం కొత్త పోలవరంలో నివాసం ఉంటున్న కూతురు, అల్లుడు వద్దకు వెళ్లింది. సాయంత్రం ఇంటికి వెళ్లి పోతానని అల్లుడుతో చెప్పి స్వగ్రామం బయల్దేరింది. రాత్రి సుబ్బారాయుడుపాలెం వద్ద రక్తపు మడుగులో ఆమె పడి ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు అక్కడికి చేరుకొని విచారణ జరిపారు. మృతురాలు వెంకట రత్నకుమారిగా గుర్తించారు. ఆమెకు మానసిక ఆరోగ్య స్థితి సరిగా ఉండదని, కుటుంబ సభ్యులు వైద్యం చేయిస్తున్నారని ఎస్‌ఐ వివరించారు. ఎస్.రాయవరం నుంచి తామరం బయల్దేరి పెదబొడ్డేపల్లిలో బస్సు దిగిపోయి ఉంటుందని తెలిపారు. వాహనాలు అందుబాటులో లేక పెదబొడ్డేపల్లి నుంచి తామరం నడుచుకొని వెళ్తుండగా గుర్తుతెలియన వాహనం ఢీకొని ఉంటుందని భావిస్తున్నట్టు చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నీటి సంపులో పడి సెక్యూరిటీ గార్డు..


గణేశ్ మృతదేహం

విశాఖపట్నం, మార్చి 27: విధి నిర్వహణలో ఉన్న ఓ సెక్యూరిటీ గార్డు ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి మృతి చెందాడు. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా కశింకోటకు చెందిన అల్లవరపు గణేశ్ (32) ఆటోనగర్‌లోని టీపీఎల్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. ఇక్కడి మంగళపాలెంలో గణేశ్ భార్య దేవి, తల్లి రత్నతో కలిసి ఉంటున్నాడు. మంగళవారం విధులకు వెళ్లిన గణేశ్ బుధవారం ఉదయం ఇంటికి రాకపోవడంతో భార్య ఆందోళనకు గురైంది. కాగా అదే కంపెనీలో పనిచేస్తున్న కె.శ్రీను అనే వ్యక్తి ఆమెకు ఫోన్ చేసి కంపెనీ ఆవరణలోని నీటి సంపులో పడి గణేశ్ మృతి చెందినట్టు తెలిపాడు. కంపెనీ యాజమాన్యం అందించిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని గణేశ్ మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడికి మూడేళ్ల క్రితమే వివాహమైంది. దేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపు తప్పి యువకుడికి గాయాలు


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సాలాపు శ్రీను

సబ్బవరం, మార్చి 27: సబ్బవరం-చోడవరం రోడ్డులో బంగారమ్మపాలెం వద్ద బుధవారం బైక్ అదుపు తప్పడంతో యువకుడు గాయపడ్డారు. బంగారమ్మపాలెంకు చెందిన సాలాపు శ్రీను తల్లి దండ్రులు ఉపాధి నిమిత్తం కొత్తవలసలో స్థిరపడ్డారు. గ్రామంలో ముత్యమాంబ అమ్మవారి జాతరకు స్వగ్రామం బంగారమ్మపాలెం ఇటీవల వచ్చారు. ఈ నేపథ్యంలో పని మీద శ్రీను బైక్‌పై వెళుతుండగా గ్రామ సమీపంలో అదుపు తప్పి రోడ్డు పక్కన గల కాలువలోకి దూసుకుపోవడంతో గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు సబ్బవరం పీహెచ్‌సీకి తరలించగా.. వైద్యుడు డాక్టర్ చక్రవర్తి వైద్యసేవలు అందించారు. పరిస్థితి మెరుగ్గైనట్టు కుటుంబసభ్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు


చికిత్స పొందుతున్న చంటిబాబు

పెదబయలు, మార్చి 27: మండలంలోని లక్ష్మీపేట సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రంగా గాయాలు తగిలాయి. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పెదబయలు నుంచి లక్ష్మీపేట వైపు వెళుతున్న ప్రైవేటు జీపు లక్ష్మీపేట సమీపంలో బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో బొండపల్లి పంచాయతీ కేంద్రానికి చెందిన వి.చంటిబాబు, లక్ష్మీపేట పంచాయతీ మండిబ గ్రామానికి చెందిన జోగేంద్రకు తీవ్రమైన గాయాలు తగిలాయి. క్షతగాత్రులకు స్థానికుల సహాయంతో పెదబయలు పీహెచ్‌సీకి తరలించారు.

సుదర్శన నారసింహ మహా యజ్ఞానికి శ్రీకారం


పూర్ణాహుతిలో స్వరూపానంద, స్వాత్మానందేంద్ర

సింహాచలం, మార్చి 27: వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధి బుధవారం ఆధ్యాత్మిక శోభతో అలరారింది. పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో లోకకల్యాణార్థం చతుర్వేద హవనపూర్వక పాంచాహ్నిక పంచకుండాత్మక శ్రీసుదర్శన నారసింహ మహాయజ్ఞానికి అగ్నిమథనంతో బాలాగ్నిని జనింపజేసి శ్రీకారం చుట్టారు. లోకకల్యాణార్థం ఈనెల 26న అంకురార్పణంతో యాగాన్ని ప్రారంభించారు. బుధవారం ఉదయం గోమాతను ప్రవేశపెట్టి పూజలు చేశారు. అనంతరం సింహగిరి మాడవీధుల్లో గోవిందరాజస్వామి, ఉభయ దేవేరులు, సుదర్శనుని యాగశాల ప్రవేశం జరిపారు. గరుడగద్యలు పఠిస్తూ ధ్వజారోహణం గావించి దేవతలకు ఆహ్వానం పలికారు. ప్రత్యక్షంగా పాల్గొన్న సుమారు 120 జంటలకు పూజాసామగ్రిని అందజేశారు. భక్తులతో సంకల్పం చెప్పించి షోడశోపచారాల సమర్పణ, నృసింహ అష్టోత్తర శతనామావళితో పూజలు జరిపించారు. స్థానాచార్యులు డా.టీపీ రాజగోపాల్ పర్యవేక్షణలో ఈవో సింగల శ్రీనివాసమూర్తి దంపతులకు, తరువాత భారీ విరాళాలు సమర్పించిన దాతలు కేతినేడి సాయికుమార్, బోకం శ్రీనివాసరావులకు కంకణధారణ చేశారు. దేవతా వృక్షానికి చెందిన రెండు దారువులను రాపిడి చేయడం ద్వారా సశాస్త్రీయంగా అగ్నిమథనం కావించి బాలాగ్నిని జనియింపజేసి హోమకుండాలలో అగ్నిప్రతిష్ఠాపన జరిపారు. తొలిరోజు లఘు పూర్ణాహుతి చేసి తీర్థప్రసాదాల వినియోగం జరిపారు. లఘుపూర్ణాహుతిలో దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు, శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతి, పూసపాటి ఆనందగజపతిరాజు సతీమణి సుధాగజపతిరాజు, పాలకమండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	107.00
లైవ్ ధర	127.00
విత్ స్కిన్	224.00
స్కిన్ లెస్	234.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

వలస మత్స్యకార ఓట్లకు వేట

- పూరీ వెళ్లిన పేట టీడీపీ,జనసేన మత్స్యకార నేతలు
- ఓటు బ్యాంకు చెదిరిపోకుండా వ్యూహం
- నేడు అనితతో పూరీ, కోణార్క్‌ల్లో సమావేశం


పూరీలో మత్స్యకారులతో సమావేశమైన టీడీపీ మత్స్యకార నాయకులు


పూరీలో ఇంటింటా తిరుగుతున్న నక్కపల్లి మండలం టీడీపీ మత్స్యకార నాయకులు

నక్కపల్లి, మార్చి 27: ఉమ్మడి విశాఖ జిల్లాలోనే 18 మత్స్యకార గ్రామాలున్న ఏకైక నియోజకవర్గం పాయకరావుపేట. టీడీపీ ఆవిర్భావం నుంచి ఎస్.రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లోని మత్స్యకారులు సైకిల్‌నే ఎక్కువగా ఆదరిస్తున్నారు. ఈ మూడు మండలాల్లో వున్న మత్స్యకారుల్లో 6,500 నుంచి 7 వేల మంది ఓటర్లు ఒడిశాలోని పూరీ, కోణార్క్‌ల్లో చేపల వేటను కొనసాగిస్తుంటారు. పండుగలు, గ్రామ దేవత ఉత్సవాలకు కుటుంబాలు, బంధువుల ఇంట జరిగే శుభకార్యాలకు, ఎన్నికల సమయంలో ఓటు హక్కు వినియోగించుకోవడానికి మత్స్యకారులు తమ గ్రామాలకు వస్తుంటారు.

పూరీ, కోణార్క్‌లో వున్న తమ ఓటు బ్యాంకును కాపాడుకోవడం కోసం టీడీపీ మత్స్యకార నాయకులు వ్యూహం రూపొందిస్తున్నారు. నక్కపల్లి మండలం రాజయ్యపేట పంచాయతీ పరిధి రాజయ్యపేట, బోయపాడు శివారు గ్రామాల్లో 6వేలకు పైగా ఓట్లు వుండగా, వీరిలో దాదాపు 2,500 మంది మత్స్యకార ఓటర్లు పూరీ,కోణార్క్‌ల్లో వుంటున్నారు. దీంతో ఆ గ్రామ టీడీపీ, జనసేన మత్స్యకార నాయకులు పిక్కి శ్రీనివాసరావు, పిక్కి కొర్లయ్య, పిక్కి కోదండ, పిక్కి కొండలరావు, సిరిపిల్లి అప్పలరాజు, మడదా రాంబాబు, మేరుగు నాగేశ్వరరావు, గోసల చినతాతారావు, జనసేన నాయకులు పిక్కి స్వామి, వాసుపల్లి నూకరాజు మంగళవారం ఇక్కడి నుంచి బయల్దేరి పూరీ చేరుకున్నారు. బుధవారం పూరీలో ఇంటింటా సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం చేసి ముందుగా మత్స్యకారులతో మాట్లాడారు. పలుచోట్ల సమావేశాలు నిర్వహించారు. తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత కూడా బుధవారం పూరీకి బయల్దేరి వెళ్లారు. గురువారం పూరీ, కోణార్క్‌లో పలువురు మత్స్యకారులను కలిసి వారితో సమావేశం కానున్నారు. పెదతీనార్ల, చినతీనార్ల, డీఎల్‌పురం, అమలాపురం సహా పాయకరావుపేట, ఎస్.రాయవరం మండలాల నుంచి కూడా పలువురు మత్స్యకార టీడీపీ నాయకులు ఇప్పటికే పూరీ చేరుకున్నారు.

వెంకన్న క్షేత్రంలో పుష్పయాగోత్సవాలు


ఆలయంలో ప్రాకారసేవలో భాగంగా పల్లకీ మోస్తున్న అర్చకుల బృందం

నక్కపల్లి, మార్చి 27: ఉపమాక వెంకన్న వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి నుంచి ఆలయంలో స్వామివారి పుష్పయాగోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గురువారం రాత్రి వరకూ ఈ కార్యక్రమాలు జరుగుతాయి. ఆలయ రాతి కల్యాణ మండపంలో వున్న అద్దాల మండపం (శయన మందిరం)లో ఉభయ దేవేరులతో కూడిన కల్యాణ వేంకటేశ్వరుడిని, ఊయలలో పుష్పమాలలు, పట్టుపీతాంబరాలతో అలంకరించారు. ఈ సందర్భంగా అర్చకులు,భక్తులంతా అయ్యవారి, అమ్మవారి సరస సంవాదాన్ని ఎంతో చక్కగా జరిపించారు. అంతకుముందు ఆలయ ఆ స్థానమండపం చుట్టూ ఆలయ అర్చకుల బృందం పల్లకీతో ప్రాకార సేవ చేశారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

హామీలు అమలు చేయని వైసీపీని ఓడించాలి

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు


బుద్ద నాగజగదీశ్వరరావు

అనకాపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మాట తప్పిన వైసీపీని రానున్న ఎన్నికల్లో ఓటర్లు చిత్తుగా ఓడించాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. గత ఎన్నికల ముందు రాష్ట్రంలో సంపూర్ణ మద్యనిషేధం అమలుచేసి ఓట్లు అడుగుతానని చెప్పిన జగన్ హామీ ఎందుకు అమలు చేయలేదో సమాధానం చెప్పాలన్నారు. నాసిరకం మద్యం అమ్మకాలు జరపడం ద్వారా రాష్ట్రంలో 35 లక్షల మందికిపైగా ప్రజల ఆరోగ్యాన్ని నాశనం చేసిన ఘనత జగన్‌దేనన్నారు. అనేకమంది నాసిరకం మద్యం సేవించి అనారోగ్య సమస్యలతో మంచాన పడ్డారని ఆరోపించారు. కరెంట్ చార్జీలు పూర్తిగా తగ్గిస్తామని గత ఎన్నికల్లో హామీ ఇచ్చి, ఐదేళ్లలో 9 సార్లు కరెంట్ చార్జీలు పెంచడం ద్వారా రాష్ట్ర ప్రజలపై రూ.64 వేల కోట్ల అదనపు భారాన్ని మోపారని ఆరోపించారు. రైతుల పొలాలకు ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పి, ఎంపీ అవినాష్‌రెడ్డి బినామీ కంపెనీకి మీటర్లు ఏర్పాటు చేసే కాంట్రాక్టు ఇచ్చి వేల కోట్లు దోచి పెట్టినందుకా మళ్లీ వైసీపీని గెలిపించాలని ప్రశ్నించారు. ప్రతి నెలా జనవరిలో నిరుద్యోగ యువతీ, యువకుల కోసం జాబ్ క్యాలండర్ విడుదల చేస్తామని చెప్పి మాట తప్పారని, ఇసుక, నిత్యావసర సరుకుల ధరలు తగ్గిస్తామని చెప్పి నాలుగు రెట్లు ధరలు పెంచినందుకా మళ్లీ వైసీపీ అధికారంలోకి రావాలని అడుగుతున్నారు అని ఎద్దేవా చేశారు. రానున్న ఎన్నికల్లో విజ్ఞులైన ఓటర్లు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించుకొని, రాష్ట్ర అభివృద్ధికి టీడీపీ అధినేత చంద్రబాబు నాయకత్వంలో సుస్థిరంగా అభివృద్ధి చేసుకొనేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులు ప్రచారంలో పాల్గొంటే క్రిమినల్ చర్యలు

- కాశీపురంలో ఆర్టీసీ ఉద్యోగిపై ఫిర్యాదు
- విచారణ జరపాలని సదరు అధికారులకు సూచన
- మాడుగుల నియోజకవర్గ ఆర్‌వో సత్యవాణి


వాకపల్లిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రిటర్నింగ్ ఆఫీసర్ సత్యవాణి తదితరులు

దేవరాపల్లి, మార్చి 27: ఎన్నికల నియమావళిని అంతా విధిగా పాటించాలని మాడుగుల నియోజకవర్గం రిటర్నింగ్ ఆఫీసర్ జి.వి.సత్యవాణి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటైన పోలింగ్ కేంద్రాలను బుధవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా పాల్గొంటే క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారు. కాశీపురం గ్రామానికి చెందిన ఆర్టీసీ ఉద్యోగి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నట్టు తమకు ఫిర్యాదు అందిందన్నారు. నిబంధనలు అతిక్రమించే సదరు ఉద్యోగిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాల్సిందిగా ఆర్టీసీ అధికారులకు సూచించినట్టు చెప్పారు. నియోజకవర్గంలోని 235 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎన్నికల నిర్వహణకు పదిహేరు వందల మంది సిబ్బందిని సిద్ధం చేశామని, మరో పది శాతం సిబ్బందిని రిజర్వ్‌లో ఉంచుతున్నామని వివరించారు. ఎన్నికల ప్రచారం, సభలు, సమావేశాలకు విధిగా అనుమతి తీసుకోవాల్సిందిగా ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియలో మార్పులు

- రాజకీయ పార్టీల నాయకులు, వినియోగదారులు గుర్తించాలి : డీఆర్‌వో బి.దయానిధి


రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న డీఆర్‌వో బి.దయానిధి

అనకాపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికలలో పోస్టల్ బ్యాలెట్ వినియోగంలో ఎన్నికల కమిషన్ నిబంధనలను మార్పు చేసిందని, ఈ విషయాన్ని రాజకీయ పార్టీల నాయకులు, పోస్టల్ బ్యాలెట్ వినియోగదారులు గుర్తించాలని జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్‌వో) బి.దయానిధి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో వెలువడిన అభ్యంతరాలను పరిశీలనలోకి తీసుకొని కొన్ని మార్పులు చేసినట్టు చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ ఓటరు వెంట తీసుకువెళ్లకుండా వెంటనే వినియోగించే విధంగా ఎన్నికల కమిషన్ నిబంధనలను రూపొందించిందన్నారు. ఈ విషయాన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా ఓటర్లకు తెలియజేసి, అవగాహన కల్పించాలని కోరారు. గతంలో మాదిరిగా పోస్టు ద్వారా ఓటరుకు పంపించడం జరగదని గుర్తించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి కేఎస్ కుమారి మాట్లాడుతూ వివిధ రకాల పోస్టల్, హోమ్ ఓటింగ్‌ల గురించి వివరించారు. సర్వీసు ఓటర్లు, ప్రత్యేక ఓటర్లు, ఎలక్షన్ విధులలో ఉన్నవారు వివిధ రకాలుగా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకొనేందుకు అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. 85 సంవత్సరాల వయస్సు దాటి అనారోగ్యంతో ఉన్న వారికి, 40 శాతం కంటే ఎక్కువగా వైకల్యం కలిగిన వారికి ముందుగా వారి అభ్యర్థిన మేరకు పోలింగ్ అధికారి వారి ఇంటి వద్దకు వెళ్లి ఓటు వేయించుకుంటారని చెప్పారు. అయితే ఒకసారి హోమ్ ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్నట్లయితే ఆ విధంగానే ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశం గురించి అర్హతగల ఓటర్లకు తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో పార్టీల నాయకులు, అధికారులు హాజరయ్యారు.



396 తాబేళ్ల పిల్లలు స్వాధీనం

విశాఖపట్నం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కోల్‌కతా నుంచి చెన్నైకు రవాణా చేస్తున్న 396 సముద్ర తాబేళ్ల పిల్లలను డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్‌ఐ) అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం స్థానిక రైల్వే స్టేషన్‌లో వీటిని పట్టుకున్నారు. కోల్‌కతా నుంచి షాలిమార్ ఎక్స్‌ప్రెస్‌లో ఈ తాబేళ్లను తరలిస్తున్నారన్న సమాచారంతో దాడి చేసి పట్టుకున్నారు. తాబేళ్లను వన్యప్రాణి సంరక్షణ చట్టం-1972 షెడ్యూల్-5లో చేర్చారు. అందువల్ల తాబేళ్ల అక్రమ రవాణా నిషేధం. ఈ నేపథ్యంలో తాబేళ్లను అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరిని పట్టుకుని అటవీ శాఖకు అప్పగించారు.

స్వాధీనం చేసుకున్న తాబేలు పిల్లలు


ఎర్రవరంలో టీడీపీ వర్గీయులపై రాళ్లతో దాడులకు దిగిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు

ఎర్రవరంలో రెచ్చిపోయిన వైసీపీ మూక

- టీడీపీ వర్గీయులపై రాళ్లతో దాడి.. పలువురికి స్వల్ప గాయాలు
- ఇరువర్గాల వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు


టీడీపీ నేత నాగేశ్వరరావు ఇంటిపై పడిన రాళ్లు

గొలుగొండ, మార్చి 27: మండలంలోని ఎర్రవరంలో తెలుగుదేశం పార్టీ వర్గీయులపై వైసీపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం రాళ్లతో దాడులకు దిగారు. పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. దీంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలివి. ఎర్రవరం పంచాయతీ గొల్లపేట రామాలయం వీధిలో మంగళవారం గంగాదేవి పండగను నిర్వహించారు. ఈ వేడుకకు ఎర్రవరంతో పాటు వివిధ గ్రామాలకు చెందిన యువకులు విచ్చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరుగుతుండగా, బయటి నుంచి విచ్చేసిన యువకులకు, ఎర్రవరం గ్రామానికి చెందిన యువకులకు స్వల్ప వివాదం చోటుచేసుకున్నట్టు స్థానికులు తెలిపారు. ఈ ఘటనను ఎర్రవరంలోని టీడీపీకి చెందిన అమరపల్లి నాగేశ్వరరావు సెల్ ఫోన్ కెమెరా ద్వారా వీడియో తీస్తుండగా ఎర్రవరానికి చెందిన వైసీపీ నాయకులు దాడికి దిగారు. దీంతో స్థానికులు కలుగజేసుకుని వివాదం సద్దుమణిగేందుకు ప్రయత్నం చేశారు. ఇదిలావుంటే, బుధవారం మధ్యాహ్నం మూడుగంటల సమయంలో అమరపల్లి నాగేశ్వరరావు ఇంటిపైకి అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు మూకుమ్మడిగా రాళ్లతో దాడి చేశారు. పలువురికి స్వల్ప గాయాలు కావడంతో పాటు నాగేశ్వరరావు ఇంటిపై రాళ్లు పడ్డాయి. సాయంత్రం ఇరు వర్గాల వారు ఇందుకు సంబంధించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నట్టు గొలుగొండ ఎస్‌ఐ కృష్ణారావు విలేకరులకు తెలిపారు.

29న సీఎం రమేష్ రాక

- స్వాగతం పలికేందుకు అధిక సంఖ్యలో కార్యకర్తలు తరలిరావాలి
- మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు పిలుపు


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

కొత్తూరు(అనకాపల్లి), మార్చి 27: ఈనెల 29న బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ అనకాపల్లికి రానున్నారని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు. స్థానిక రింగురోడ్డు కూడలిలోని ప్రైవేటు హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులు, మూడు పార్టీల ముఖ్య నేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర భవిష్యత్తు దృష్ట్యా తెలుగుదేశం పార్టీ పొత్తు పెట్టుకుందని చెప్పారు. సీఎం రమేష్ ఈనెల 29న హైదరాబాద్ నుంచి నేరుగా విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారన్నారు. పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి లంకెలపాలెం నుంచి ఆయనకు స్వాగతం పలకాలన్నారు. అనకాపల్లి వరకు భారీ ర్యాలీ జరుగుతుందన్నారు. అనంతరం భారీ స్థాయిలో సమావేశం జరగనుందని తెలిపారు. కూటమి పార్టీల కార్యకర్తలు, అభిమానులు ఒక్కొక్క నియోజకవర్గాల నుంచి 100 కారులతో ఆయనకు స్వాగతం పలికేందుకు తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో జనసేన అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, టీడీపీ ఎలమంచిలి ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, టీడీపీ మాడుగుల అభ్యర్థి పైలా ప్రసాదరావు, జనసేన ఎలమంచిలి అభ్యర్థి విజయ్ కుమార్, నసేన పార్టీ చోడవరం ఇన్‌చార్జి రాజు, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ లాలం భవానీ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అనకాపల్లి జిల్లాలోనే అధికం

- అరికట్టేందుకు అంతా కంకణబద్ధులు కావాలి
- తల్లిదండ్రుల్లో చైతన్యానికి గ్రామాల్లో కమిటీలు
- ఐసీడీఎస్ గొలుగొండ సీడీపీవో శ్రీగౌరి


సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో శ్రీగౌరి

నాతవరం, మార్చి 27 : బాల్య వివాహాలను అరికట్టేందుకు అంతా కంకణబద్ధులు కావాలని ఐసీడీఎస్ గొలుగొండ సీడీపీవో శ్రీగౌరి కోరారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. బాల్య వివాహాలు రాష్ట్రంలోని అనకాపల్లి జిల్లాలోనే ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. మైనర్లకు వివాహాలు చేయడం వల్ల కలిగే అనర్థాలపై విద్యావంతులంతా గ్రామాల్లో ఆయా బాలికల తల్లిదండ్రులను చైతన్యవంతులను చేయాల్సిందిగా ఆమె విజ్ఞప్తి చేశారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి గ్రామంలో కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో ఎంపీడీవో రాంబాబు, తహసీల్దార్ రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాండవ షుగర్స్‌ని ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలి

- కార్మిక సంఘ నేతలు, రైతులు డిమాండ్


తాండవ షుగర్స్ దుస్థితిని వివరిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

పాయకరావుపేట, మార్చి 27: మూతపడిన తాండవ చక్కెర కర్మాగారాన్ని తెరిపిస్తామని అన్ని రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో చేర్చాలని కార్మిక నాయకులు, రైతులు డిమాండ్ చేశారు. బుధవారం ఫ్యాక్టరీ ఎదుట ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కార్మిక సంఘ నేతలు, రైతులు మాట్లాడుతూ ఐదు నియోజకవర్గాల్లోని వేల మంది చెరకు రైతుల కోసం ఆరు దశాబ్దాల క్రితం సహకార రంగంలో ఏర్పాటుచేసిన తాండవ షుగర్స్‌ను తెరిపించాలన్నారు. ఫ్యాక్టరీని ఆదుకునే ప్రయత్నాన్ని ప్రభుత్వాలు చేయలేదన్నారు. రైతులకు సకాలంలో పేమెంట్లు అందక చెరకు పంటకు దూరమవడంతో ఫ్యాక్టరీలో మూడేళ్లుగా క్రషింగ్ నిలిచిపోయిందన్నారు. కార్మికులకు రూ.11 కోట్ల జీతాల బకాయిలు ఇప్పటికి ఇవ్వలేదన్నారు. దీనివల్ల వందలాది కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని వాపోయారు. ఇప్పటికైనా రాజకీయ పార్టీలు స్పందించి తాండవ షుగర్స్‌ని తెరిపించేలా తమ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు కర్రి శ్రీను, కసిరెడ్డి నాగేశ్వరరావు, దండెం రమణ, ఎన్‌టీ.సీతారామ్మూర్తి, రైతులు ఆళ్ల నాగేశ్వరరావు, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

పంచకర్ల సమక్షంలో పలువురు జనసేనలో చేరిక



పంచకర్ల సమక్షంలో జనసేనలో చేరిన వైసీపీ నేతలు, కార్యకర్తలు

సబ్బవరం, మార్చి 27 : మండలంలోని ఆరిపాక గ్రామానికి చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు, నేతలు బుధవారం జనసేన పార్టీలో చేరారు. జనసేన పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు వారందరికీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. జనసేన పార్టీలో వైసీపీ సమన్వయ కమిటీ సభ్యులు, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ పిన్నమరాజు సత్యనారాయణరాజు, వి.రామకృష్ణ, డి.కృష్ణచైతన్య, ఎలమంచిలి మారయ్య, పి అప్పారావు, పీఎం నాయుడు ఉన్నారు. ఈ సందర్భంగా పంచకర్ల మాట్లాడుతూ.. తీవ్రంగా నష్టపోయిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం ఏర్పాటుకు టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఘనంగా సత్యసాయి బాబా ఆగమన 60 ఏళ్ల వేడుకలు

ఎలమంచిలి, మార్చి 27: పట్టణంలో బుధవారం సత్యసాయిబాబా ఆగమన 60 సంవత్సరాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. సత్యసాయిబాబా ఎలమంచిలికి 1965 మార్చి 27 తేదీన వచ్చారని, ఆయన ఆగమనాన్ని కీర్తిస్తూ 60 ఏళ్ల వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సత్యసాయి ధర్మ స్థూపం వరకూ స్వామివారి దివ్య పల్లకీ సేవలో నిర్వహించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా రామ్‌చరణ్ జన్మదిన వేడుకలు



బాలింతకు రొట్టెలు పంపిణీ చేస్తున్న పృథ్వీరాజ్

అనకాపల్లి టౌన్, మార్చి 27 : సినీ హీరో రామ్‌చరణ్ జన్మదినం వేడుకల్లో భాగంగా స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో బుధవారం సినీనటుడు పృథ్వీరాజ్ గర్భిణులు, బాలింతలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ మెగా హీరోల అభిమానులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనకాపల్లిలో అభిమానులు ఎక్కువగా ఉండడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రామ్‌చరణ్ ఫ్యాన్స్ అధ్యక్షుడు మళ్ల శ్రీను, ఉత్తరాంధ్ర చిరంజీవి యువత అధ్యక్షుడు గళ్లా కొండలరావు, కొణతాల శ్రీను, తాడి రామకృష్ణ, భరణికాన రాము, అప్పికొండ గణేష్ పాల్గొన్నారు.

ఏపీ ఇందిరమ్మ షర్మిల

» కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి గంగాధర్

అనకాపల్లి టౌన్, మార్చి 27 : రాష్ట్ర ప్రజలు ఇందిరమ్మలో చూసిన ఉక్కు సంకల్పాన్ని ప్రస్తుత పీసీసీ అధ్యక్షురాలు షర్మిలో చూస్తున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఐఆర్ గంగాధర్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ షర్మిల పోరాట పటిమతో రాష్ట్రానికి ప్రత్యేక హోదా తేవడం తథ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు విజ్ఞతతో ఓటు వేయాలని కోరారు. ప్రతి పేద కుటుంబానికి మహాలక్ష్మి పథకం ద్వారా ఐదేళ్లలో రూ. ఐదు లక్షలు ఆర్థిక లబ్ధి చేకూరే అవకాశముందన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు ఎగ్గాడ భాస్కరరావు, కట్టమూరు నూకఅప్పారావు, కొల్లి సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా తాగునీటి సరఫరా చేయాలి : ఎంపీడీవో

పాయకరావుపేట, మార్చి 27 : మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ కె.స్వప్న అధికారులను ఆదేశించారు. బుధవారం తన కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రానున్న వేసవిలో నీటి సరఫరాను సక్రమంగా చేయాలన్నారు. పారిశుధ్యం మెరుగు, వీధిలైట్ల మరమ్మతులు ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. పంచాయతీల్లో ఇంటి పన్నులు, ఇతర పన్నులు ఈనెలాఖరు నాటికి 100 శాతం వసూలు చేయాలన్నారు. ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు వడదెబ్బ తగలకుండా ఏర్పాట్లు చేయడంతోపాటు తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల నిబంధనలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఈఓఆర్డీ చంద్రశేఖర్ తోపాటు, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఎం, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణ అందరి బాధ్యత

» ఎలమంచిలి రిటర్నింగ్ అధికారి మనోరమ



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో మనోరమ

ఎలమంచిలి, మార్చి 27: ఎన్నికల నియమావళిని పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడం అందరి బాధ్యత అని ఎలమంచిలి అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి మనోరమ అధికారులను ఆదేశించారు. బుధవారం తహసీల్దారు కార్యాలయ ఆవరణలో నియోజకవర్గంలోని బీఎల్వోలు, ఎన్నికల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఓ మాట్లాడుతూ బీఎల్వోలు హెడ్‌క్వార్టర్‌లో ఉండాలని, విధి నిర్వహణలో అలక్ష్యం వహించకూడదన్నారు. పోలింగ్ ముందు రోజు డిగ్రీ కళాశాల ఆవరణలో ఎన్నికల సామగ్రి పంపిణీ నుంచి ఎన్నికల రోజు అనుసరించాల్సిన విధి విధానాలు వివరించారు. అనంతరం ఏఈ ఆర్‌ఓలు, తహసీల్దారులు సీ-విజిల్ ఫిర్యాదులు గురించి, యాప్‌లు గురించి వివరించారు.

నవమి వేడుకలకు రాటోత్సవం

నక్కపల్లి, మార్చి 27: మండలంలోని ఉపమాక మెరకవీధి రామాలయం వద్ద శ్రీరామ నవమి వేడుకలకు బుధవారం రాటోత్సవం నిర్వహించారు. ఈ సంవత్సరం కూడా నవమి వేడుకల్లో భాగంగా సప్తాహ వేడుకలు నిర్వహిస్తామని నిర్వాహకులు చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు కొప్పిశెట్టి కొండబాబు, సిద్దాబత్తుల కృష్ణ, కొప్పిశెట్టి బుజ్జి, చెరుకూరి వెంకటేశ్వరరావు, ప్రగడ బాబ్జీ, ప్రగడ బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

నాలుగు నుంచి ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ

అనకాపల్లి టౌన్, మార్చి 27 : స్థానిక పరమేశ్వరి పార్కు జంక్షన్‌లోని సత్యసాయి విద్యాలయంలో ఏప్రిల్ నాల్గో తేదీ నుంచి పాలిటెక్నికల్ ప్రవేశపరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఉచితంగా గౌరీ ఉపాధ్యాయుల సంక్షేమ సంఘం శిక్షణ ఇవ్వనుందని సంఘ ప్రతినిధులు తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం నాలుగు గంటల నుంచి విద్యార్థులకు శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు తమ పేర్లను పార్కు సెంటర్ వద్ద గల న్యూ లక్ష్మీ శ్రీనివాస టెంట్ హౌస్ వద్ద నమోదు చేసుకోవాలని సంఘ ప్రతినిధులు తెలిపారు.

నేడు పైడిమాంబ విగ్రహ ప్రతిష్ఠ

రాంబిల్లి, మార్చి 27 : మండలంలోని మామిడివాడలో నూతనంగా నిర్మించిన పైడిమాంబ అమ్మవారి ఆలయం ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు గురువారం జరగనున్నాయి. ఆలయ ప్రాంగణంలో ఉదయం నుంచి అర్చకులు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తున్నారు.

తుమ్మపాల షుగర్స్ భూములపై వైసీపీ నేతల కన్ను : కొణతాల

అనకాపల్లి టౌన్, మార్చి 27 : తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీ భూముల పై వైసీపీ నేతల కన్ను పడిందని జనసేన పార్టీ అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ అన్నారు. స్థానిక గవరపాలెం సతకంపట్టు వద్ద బుధవారం కాఫీ విత్ కేడర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొణతాల మాట్లాడుతూ విలువైన తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీ భూములను కొట్టేందుకు వైసీపీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. షుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి పట్టించుకోలేదన్నారు. ఈ కారణంగా చెరకు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అడ్డుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గాజుగ్లాస్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గవరపాలెంకు చెందిన టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



గవరపాలెంలో ప్రచారం చేస్తున్న కొణతాల రామకృష్ణ

కొణతాలకు మద్దతుగా సినీనటుడు పృథ్వీరాజ్ ప్రచారం

అనకాపల్లి టౌన్, మార్చి 27 : పట్టణంలో బుధవారం జనసేన అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణకు మద్దతుగా సినీనటుడు పృథ్వీరాజ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉడ్‌పేట, బాలాజీరావుపేట తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించి, ఎన్నికల్లో కొణతాల రామకృష్ణను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి అధికారంలోకి రావడం తథ్యమన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు దూలం గోపి, మళ్ల శ్రీను, తాడి రామకృష్ణ పాల్గొన్నారు.

కశింకోటలో.. రాష్ట్రంలోని రైతులందరూ అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వం మారాలని సినీనటుడు పృథ్వీరాజ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జనసేన మండల నాయకుడు బుదిరెడ్డి చిన్న నివాసానికి వెళ్లి అక్కడ ఉన్న జనసైనికులతో మాట్లాడారు. అనంతరం వెదురుపర్తి పొలాల్లోని రైతులతో మాట్లాడారు. పాడి రైతు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే కూటమి అభ్యర్థి కొణతాల రామకృష్ణను గెలిపించి చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిగా చేయాలన్నారు. ముందుగా కశింకోట నుంచి వెదురుపర్తి వరకు జనసైనికులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు, బీజేపీ నాయకులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



వెదురుపర్తిలో రైతులతో మాట్లాడుతున్న సినీనటుడు పృథ్వీరాజ్

కొణతాల గెలుపునకు ప్రచారం

కశింకోట, మార్చి 27 : మండలంలో బంగారయ్యపేటలో జనసేన అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణకు మద్దతుగా టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు బుధవారం ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి వెళ్లి కొణతాలను గెలిపించాలని, అభ్యర్థి విజయానికి కృషి చేయాలని కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ గాజుగ్లాస్ గుర్తుకు ఓటేసి ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడుని గెలిపించాలన్నారు. అనంతరం సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



బంగారయ్యపేటలో ప్రచారం చేస్తున్న జనసేన, టీడీపీ, బీజేపీ కార్యకర్తలు



కంటోన్మెంట్ ఏరియాలో ఇంటింటి ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం

పాయకరావుపేట, మార్చి 27 : పట్టణంలో టీడీపీ, జనసేన పార్టీ నాయకులు బుధవారం ఇంటింటికి తిరిగి సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. స్థానిక కంటోన్మెంట్ ఏరియాలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు తదితరులు పాల్గొని ప్రజలకు టీడీపీ సూపర్ సిక్స్ పథకాల ద్వారా చేకూరే లబ్ధిపై అవగాహన కల్పించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిని వంగలపూడి అనిత గుర్తు సైకిల్‌పై ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు చింతకాయల రాంబాబు, పల్లా విలియంకేరి, సూరా సుబ్రహ్మణ్యం, లెక్కల గోవిందు, గుల్లా నాగరాజు, వేములపూడి అప్పారావు, జనసేన నేతలు ఆచంట దొర, శివలంక నాగమల్లి, బీఎస్.నారాయణపాల్గొన్నారు.

హమ్మయ్య.. టెన్త్ పరీక్షలు అయిపోయాయ్...!

కోటవురట్ల, మార్చి 27: పదో తరగతి పరీక్షలు బుధవారంతో ముగిశాయి. దీంతో బాలికల హస్టల్, బాలురు బీసీ వసతిగృహం, కేజీబీవీలో చదువుతున్న విద్యార్థులు ఇంటిబాట పట్టారు. కోటవురట్లలో రెండు, పాములవాక కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు.పరీక్ష అయిన వెంటనే హాస్టళ్లలో ఉన్న విద్యార్థులంతా ఇళ్లకు పయనమయ్యారు.

రాంబిల్లిలో.. మండలంలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన పదో తరగతి పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయని ఎంఈవో ఎం.సూర్యారావు తెలిపారు. రాంబిల్లి, పంచదార్ల, దిమిలిలోని నాలుగు కేంద్రాల్లో పరీక్షలు జరిగాయని, వీటిలో 620 మంది విద్యార్థులు పరీక్షలు రాశారన్నారు.

సబ్బవరంలో.. మండలంలో ఈనెల 18వ తేదీ నుంచి జరుగుతున్న పదో తరగతి పరీక్షలు బుధవారంతో ప్రశాంతంగా ముగిశాయని ఎంఈవో-1 లక్ష్మణరావు తెలిపారు. సబ్బవరంలో ఐదు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించినట్టు ఆయన చెప్పారు.



కోటవురట్ల హైస్కూల్‌లో పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు

డైట్ కళాశాల విద్యార్థినుల అద్భుత ప్రతిభ

» కరెంట్ వైర్ ముట్టుకున్నా షాక్ కొట్టని పరికరం రూపకల్పన

అనకాపల్లి టౌన్, మార్చి 27 : మన ఇంట్లో చిన్నపిల్లలు పొరపాటున ఎలక్ట్రికల్ వైర్‌లు, సాకెట్స్ ముట్టుకుని షాక్‌కు గురవుతుంటారు. ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఈ సమస్యకు పరిష్కారం చూపారు స్థానిక డైట్ కళాశాలలో రెండవ సంవత్సరం ఈసీఈ చదువుతున్న నాళం హేమలత, రెడ్డి ఆలేఖ్య, ఆడారి అమృత, మెట్ట ఝాన్సీలక్ష్మి. ఎవరైనా ఈ పరికరానికి అమర్చిన సెన్సార్ ద్వారా కరెంట్ వైర్ ముట్టకోగానే సెన్సార్ ఆక్టివేట్ అయి విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తుందని ప్రాజెక్టు ఇంజినీర్ భమిడిపాటి శేషగిరిరావు తెలిపారు. ఈ పరికరం తయారు చేయడానికి ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డు, 12ఓల్ట్స్ పవర్ సప్లయ్, సర్క్యూట్ బ్రేకర్, బల్స్, వైర్ వాడినట్టు ఆయన చెప్పారు. ఈ పరికరం తయారు చేయడానికి కేవలం రూ.400 ఖర్చు చేసినట్టు విద్యార్థినులు తెలిపారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ ఈ పరికరం ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందంటూ విద్యార్థులను ప్రశంసించారు. ఈ ప్రాజెక్టు చేయడానికి అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్. వీర్రాజు గైడ్ చేశారని కళాశాల ప్రిన్సిపాల్ వైకుంఠరావు తెలిపారు.



పరికరాలతో విద్యార్థులు, ప్రిన్సిపాల్ వైకుంఠరావు

జనసేనలో చేరిన వైసీపీ శ్రేణులు



జనసేనలో చేరిన వైసీపీ శ్రేణులతో సుందరపు విజయకుమార్

అచ్యుతాపురం, మార్చి 27: మండలంలో పలు పంచాయతీల నుంచి వైసీపీ శ్రేణులు బుధవారం జనసేన పార్టీలో చేరారు. అచ్యుతాపురం పంచాయతీ సర్పంచ్‌గా పోటీచేసి పరాజయం పాలైన ప్రేరణ విద్యానికేతన్ కరస్పాండెంట్ కూండ్రపు రమణ తన అనుయాయులతో జనసేనలో చేరారు. అలాగే చిప్పాడ ఎంపీటీసీ సభ్యుడు, ఉద్దపాలెంకి చెందిన రాజాన పైడి భాస్కరరావు తన అనుచరులతో జనసేన తీర్థం పుచ్చుకున్నారు. వైసీపీ నునపర్తి సచివాలయ కన్వీనర్ సిరవరపు రమణ, నాయకులు పోలీస్ శ్రీను, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కూండ్రపు చినబాబు, వార్డు మెంబరు వర్రి పారునాయుడు, చుక్క కృష్ణ తదితరులు జనసేన పార్టీలో చేరారు. వీరందరికీ ఎలమంచిలి జనసేన అభ్యర్థి సుందరపు విజయకుమార్ పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనపరెడ్డి శ్రీనివాసరావు, బైలపూడి శ్రీరామదాసు, లాలం చందు, కొక్కిరగెడ్డ పవన్ విజయ్, మోటూరు శ్రీవేణి, బొందల శ్యామ్, పైల రామునాయుడు, పి.శివశంకర్, నగిరెడ్డి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

దుర్గాభవానీ కుటుంబానికి ఆర్థిక సాయం



చెక్‌ను అందజేస్తున్న జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ

తుమ్మపాల, మార్చి 27 : నక్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తూ ఇటీవల మరణించిన ఉమెన్ పీసీ డి. దుర్గాభవానీ కుటుంబానికి జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ తన కార్యాలయంలో విడో ఫండ్ నుంచి రూ. 50వేలు నగదు చెక్‌ను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుర్గాభవానీ కుటుంబానికి పోలీస్ శాఖ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి. విజయభాస్కర్, ఏఆర్ డీఎస్పీ పి. నాగేశ్వరరావు, ఏవో శారదా పాల్గొన్నారు.

'పట్నం' రహదారి విస్తరణ అస్తవ్యస్తం

... 5వ పేజీ తరువాయి

అధికంగా ఉన్న అబీద్ సెంటర్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం 100 అడుగులు రోడ్డు విస్తరణ చేయాలని ఎమ్మెల్యే భావించారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరులో జాప్యం కారణంగా నిర్మాణ పనులు అస్తవ్యస్తంగా సాగుతున్నాయి.

కాంట్రాక్టర్‌కు రూ.3 కోట్లు బకాయిలు!

అబీద్ సెంటర్ నుంచి పెదబొడ్డేపల్లి మదుం వరకు 1800 మీటర్ల రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులు చేపట్టవలసి ఉండగా, 8 నెలల వ్యవధిలో కేవలం 265 మీటర్ల రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. అబీద్ సెంటర్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు 265 మీటర్ల వరకు బీటీ రోడ్డు వేయడానికి ఏర్పాట్లు చేశారు. అయితే కాంట్రాక్టరుకు రూ.3 కోట్లు బకాయిలు విడుదల కాకపోవడంతో తారు వేయలేదని సమాచారం. డివైడర్ నిర్మాణం పూర్తి చేసి సెంటర్ లైటింగ్ కోసం స్తంభాలు ఏర్పాటు చేశారు. డివైడర్ మధ్యలో మొక్కలు వేయడానికి మట్టి వేశారు. డ్రైనేజీ ల నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. స్వామి అయ్యప్ప గుడి కమిటీ, సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ప్రైవేటు భవన యజమానులు కోర్టుకు వెళ్లి స్టే తీసుకురావడంతో ఆయా చోట్ల డ్రైనేజీ పనులు నిలిచిపోయాయి. మిగిలిన 500 మీటర్లు డ్రైనేజీ పనులు పూర్తి చేసి కవర్ శ్లాబ్‌లు కూడా పూర్తి చేశారు. అదేవిధంగా పెదబొడ్డేపల్లి మదుం దగ్గర నుంచి 200 మీటర్లు వరకు డ్రైనేజీ పనులు పూర్తి చేశారు. కోర్టును ఆశ్రయించిన భవన యజమానుల ఆస్తులు ఉన్న చోట డ్రైనేజీ పనులు ఆపేసి, రోడ్డు విస్తరణకు అంగీకరించిన భవన యజమానుల ఆస్తులు ముందు డ్రైనేజీ పనులు చేపడుతున్నారు. దీంతో డ్రైనేజీ పనులు అస్తవ్యస్తంగా జరుగుతున్నాయి. ఇప్పటివరకు కాంట్రాక్టరు చేపట్టిన పనులకు ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయలేదు. కాంట్రాక్టరుకు బిల్లులు విడుదల చేస్తే గాని బీటీ రోడ్డు పూర్తిచేసే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికైనా ఎమ్మెల్యే, అధికారులు స్పందించి రోడ్డు విస్తరణ పూర్తికావడానికి చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

నీటి ప్రాజెక్టులను గాలికొదిలేశారు!

... 5వ పేజీ తరువాయి

ప్రభుత్వం తన వాటాగా 15 శాతం ఇవ్వాలి. అయితే రాష్ట్ర ప్రభుత్వం తన వాటా సొమ్ము విడుదల చేయకపోవడంతో ప్రాజెక్టు ఆధునికీకరణ పనులు మధ్యలో నిలిచిపోయాయి. అలాగే కోనాం రిజర్వాయర్, కాలువల నిర్వహణ, మరమ్మతులకు 2019-20 నుంచి 2022-23 వరకు రూ.80.86 లక్షలు, పెద్దేరుకు రూ.2.65 లక్షలు మాత్రమే కేటాయించారు. అవి కూడా విడుదల చేయలేదు. ప్రభుత్వ నిధులతో సంబంధం లేకుండా ప్రాజెక్టుల నిర్వహణ అంటే జనరేటర్‌కు డీజిల్, గేట్లకు గ్రీజు, విద్యుత్ బిల్లులు, ఇతరత్రా ఖర్చులకు అప్పులు చేయాల్సి వచ్చింది. పెద్దేరు రిజర్వాయర్ నుంచి అదనపు ఆయకట్టుకు నీరందించేందుకు రూ.9.12 కోట్లతో పనులు చేపట్టాలని గత ఏడాది ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే ప్రాజెక్టు కాలువల ఆధునికీకరణ పనులకు గత ఏడాది రూ.84.4 కోట్ల మంజూరుకు ప్రభుత్వం ఆమోదం తెలపడంతో టెండర్లు పిలవగా ఒకరు వచ్చారు.

చిన్న చెరువుల అభివృద్ధిపై నిర్లక్ష్యం

ప్రపంచ బ్యాంకు ఆర్థిక సాయంతో ఆంధ్రప్రదేశ్ సమీకృత సేద్య వ్యవసాయ పరివర్తన ప్రాజెక్టు (ఏపీఐఐఎటీపీ) కింద ఉమ్మడి జిల్లాలో రూ.33.46 కోట్లతో 50 చెరువుల పునరుద్ధరణకు ఆమోదం లభించింది. ప్రపంచ బ్యాంకు 70 శాతం నిధులు మంజూరుచేయగా, రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం వాటాగా ఇవ్వాల్సి ఉంది. మొదట 33 చెరువులకు సంబంధించి 13 పనులకు రూ.20.84 కోట్లతో టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు అప్పగించారు. అయితే ఇప్పటివరకు కేవలం రూ.1.93 కోట్ల విలువైన పనులు పూర్తిచేయగా రూ.1.29 కోట్లు బిల్లులు మంజూరుచేశారు. అవి కూడా 2022లో బిల్లులు అప్‌లోడ్ చేయగా 2023లో ఖాతాలకు జమ అయ్యాయి. దీంతో పద్మనాభం మండలం రేవిడి గ్రామంలో యానాద్రి చెరువు, దేవరాపల్లి మండలం మునిడిపల్లెలో మాటలవాని చెరువు, నాగరాయుడు చెరువు, తెనుగుపూడిలో రాజుచెరువు పనులు సగంలో నిలిచిపోయాయి. కాగా ప్రపంచ బ్యాంకుతో చేపట్టాల్సి ఉన్న మిగిలిన 17 చెరువుల అభివృద్ధికి కాంట్రాక్టర్లు చేసుకున్న ఒప్పందాలు రద్దు చేసుకున్నారు. ఇదిలావుండగా శారదా నదిపై పలుచోట్ల గ్రోయిన్లకు ప్రత్యామ్నాయంగా చెక్‌డ్యామ్‌లు నిర్మించాలన్న ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదు. జిల్లాల విభజనతో విశాఖలో ఉన్న జల వనరుల శాఖ ఈఈ కార్యాలయాన్ని నర్సీపట్నానికి తరలించారు. గత ఏడాది అక్టోబరు నెలాఖరున ఈఈ శ్రీనివాసరావు స్వచ్ఛంద పదవీ విరమణ చేయగా అప్పటి నుంచి నర్సీపట్నం డీఈ ఇన్‌చార్జిగా ఉన్నారు. అయినా ఉన్న సిబ్బందికే పని లేదు. ఇదిలావుండగా రానున్న ఖరీఫ్ నాటికి ప్రాజెక్టులు, కాల్వలను సిద్ధం చేయాల్సి ఉన్నా అధికారులు వాటి సంగతే మరిచిపోయారు. నిధుల కోసం కొత్తగా ప్రతిపాదనలు పంపవద్దని గత ఏడాది ప్రభుత్వం ఆదేశించింది.

రాష్ట్రంలో రంగస్థల కళాకారులకు అన్యాయం

» లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి



రంగస్థల కళాకారులను సత్కరిస్తున్న బాబ్జి

అనకాపల్లి టౌన్, మార్చి 27 : రాష్ట్రంలో రంగస్థల కళాకారులకు తీవ్రమైన అన్యాయం జరిగిందని లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. బుధవారం ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా వేల్పులవీధిలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ పౌరాణిక నటులు మిర్తిపాటి ఈశ్వరరావు, దేవాదుల శివజోగారావులను ఈ సందర్భంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రంగస్థల కళాకారులకు కనీసం పింఛన్ మంజూరు చేయలేదని, గుర్తింపు కార్డులు లేవన్నారు. రాష్ట్రంలో చాలామంది గొప్ప కళాకారులు ఉపాధి లేక ఆకలితో చనిపోయిన సంఘటనలు ఉన్నా ప్రభుత్వంలో చలనం లేని పరిస్థితి నెలకొందన్నారు. రంగస్థల కళాకారులకు ప్రత్యేక కాలనీలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కళాకారుల సంక్షేమ సంఘం ప్రతినిధులు కనుబుడ్డి నరసింగరావు, కొలసాని రమణ, శంకరరావు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

గౌరీ పరమేశ్వరుల పంచలోహ విగ్రహం ఊరేగింపు

అనకాపల్లి టౌన్, మార్చి 27 : స్థానిక మెయిన్‌రోడ్డులోని కుంచావారి గౌరీ పరమేశ్వరుల పంచలోహ విగ్రహాన్ని బుధవారం ఆలయ కమిటీ ప్రతినిధులు పురవీధుల్లో ఊరేగించారు. గౌరీ పరమేశ్వరుల పంచలోహ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు గురువారం జరగనున్న నేపథ్యంలో బుధవారం ఉదయం గౌరీ పరమేశ్వరుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ ఎం.వీరభద్రరావు, గౌరవాధ్యక్షుడు పొండ్రంకి సత్యారావు, కోరుకొండ సాంబశివరావు, పాలూరి శ్రీనివాసరావు, కొమ్మోజు రామకృష్ణ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

నక్కపల్లి, మార్చి 27: మండలంలోని రాజయ్యపేటలో ఇటీవల సెప్టిక్ ట్యాంక్‌కు గొయ్యి తవ్వుతుండగా మృతి చెందిన రంగాల జగదీశ్ కుటుంబానికి రూ.16వేలు విరాళాన్ని బుధవారం గీత కార్మిక సంఘం డైరెక్టర్ గుత్తుర్తి పాండురంగ అందజేశారు. రాష్ట్ర శెట్టి బలిజ కన్వీనర్ కుడిపూడి సత్తిబాబు, ఒనుం శ్రీనివాసరావు, దమ్ము అప్పారావు, పెంకే ఆనంద్, దుంగా అప్పలరాజు, దమ్మురాజు, తదితరులు రాజయ్యపేట వెళ్లి జగదీశ్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు.

కార్పెంటర్స్ డే వేడుకలు



ప్రదర్శన నిర్వహిస్తున్న కార్పెంటర్లు

అనకాపల్లి టౌన్, మార్చి 27 : పట్టణంలో బుధవారం కార్పెంటర్స్ డేను కార్పెంటర్లు ఘనంగా జరుపుకున్నారు. కామాక్షి కార్పెంటర్స్ సంఘం ఆధ్వర్యంలో పట్టణ పురవీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్ వైద్యాలయంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పెంటర్స్ సంఘం ప్రతినిధులు కోసూరి మన్మథరావు, వానపల్లి కోటేశ్వరరావు, సింహాద్రి కోటేశ్వరరావు, ఎం.రామకృష్ణ, విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వరి సాగులో విత్తన మార్పిడి తప్పనిసరి

» ఐదు మండలాల వ్యవసాయ సిబ్బందికి అవగాహన



విత్తన మార్పిడిపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నక్కపల్లి, మార్చి 27: మండలంలోని ఉద్దండపురం ఆర్‌బీకేలో ఐదు మండలాల వ్యవసాయ సిబ్బందికి బుధవారం విత్తన మార్పిడి, ఖరీఫ్ వరి సాగు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో 37,500 ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారని, విత్తన మార్పిడి చేసుకునేలా రైతులకు ఎలా అవగాహన కల్పించాలో వివరించారు. ఎలమంచిలి ఏడీఈ రవిప్రకాశ్, నక్కపల్లి ఏవో ఉమాప్రసాద్, ఏఈవోలు సత్యనారాయణ, నాయుడు, బాబాజీ పాల్గొన్నారు.

ఘనంగా రామ్‌చరణ్ జన్మదిన వేడుకలు

» వంద మంది జనసైనికులు రక్తదానం



రక్త దానం చేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం, మార్చి 27: గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ పుట్టిన రోజు వేడుకలు అఖిల భారత రామ్‌చరణ్ యూత్ అధ్యక్షుడు లాలం చందు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్‌చేసి అందరికీ స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో వందమంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎలమంచిలి ఉమ్మడి అభ్యర్థి సుందరపు విజయకుమార్, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మిరెడ్డి నాయుడు బాబు, బైలపూడి శ్రీరామదాసు, కె. పవన్ విజయ్, కూండ్రపు వెంకునాయుడు, లాలం కొండలరావు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మతల్లి తొలేళ్ల పండుగ

సబ్బవరం, మార్చి 27: మండలంలోని అంతకాపల్లి, బంగారమ్మపాలెం గ్రామాల్లో ముత్యాలమ్మతల్లి అమ్మవారి తొలేళ్ల పండుగ బుధవారం వైభవంగా నిర్వహించారు. వేకువజాము నాలుగు గంటల నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. మధ్యాహ్నం సాముగరిడీలు, నేల డ్యాన్స్‌లు, చిటికెన భజనలు, కోలాటీలతో అమ్మవారిని ఊరేగించారు. అమ్మవార్లను వీకేపీసీపీఐఆర్ చైర్మన్ చొక్కాకుల వెంకటరావు, వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్టీ రామకాసు, సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, వైస్ఎంపీపీ-2 చొక్కాకుల గోవింద, మాజీఎంపీపీ ఎస్.ముత్యాలనాయుడు, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు దొడ్డి అరుణ, సూర్యప్రకాష్ దర్శించుకొని పూజలు చేశారు.

విస్తృతంగా పోలీసులు వాహన తనిఖీలు



వెంకన్నపాలెం జంక్షన్ వద్ద వాహనాన్ని తనిఖీ చేస్తున్న సీఐ, పోలీసులు

చోడవరం, మార్చి 27 : మండలంలోని వెంకన్నపాలెం జంక్షన్ వద్ద బుధవారం పోలీసులు వాహన తనిఖీ చేపట్టారు. డబ్బు, మద్యం ఇతర కానుకల తరలింపు నిరోధానికి ప్రత్యేకంగా దృష్టిసారించాలని జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశాల నేపథ్యంలో స్థానిక సీఐ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్లు ఇతర వాహనాలతో పాటు, ద్విచక్ర వాహనాలను కూడా ఆపి క్షుణ్ణంగా తనిఖీలు జరిపారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చేపట్టే చర్యలపై పలువురికి వివరించారు.

నర్సీపట్నం అర్బన్ : ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో తనిఖీలు ముమ్మరం చేసినట్టు నర్సీపట్నం రూరల్ సీఐ హరి బుధవారం విలేకరులకు తెలిపారు. కోడ్ అమలులోకి వచ్చిన నాటి నుంచి సారా విక్రయించేవారు 40మందిని బైండోవర్ చేశామన్నారు. బెల్ట్‌షాపులపై దాడులు నిర్వహించి 974 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, 37 మందిపై కేసులు నమోదు చేసినట్టు చెప్పారు. కోడిపందాల శిబిరాలపై దాడులు చేసి 12బైక్‌లు, ఏడు మొబైల్స్ సీజ్‌చేసి, రూ.97,770 నగదును స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు.

సమస్యలపై భవన నిర్మాణ కార్మికులు ధర్నా



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

దేవరాపల్లి, మార్చి 27 : భవన నిర్మాణాలకు ఇసుకను మంజూరు చేసి పనులు కల్పించాలని, లేకుంటే తమకు తిండైనా పెట్టాలని డిమాండ్ చేస్తూ ఇక్కడి తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం పలువురు భవన నిర్మాణ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు డి.వెంకన్న మాట్లాడుతూ మండలంలో భవన నిర్మాణ కార్మికులు ఐదు వందల మంది ఉన్నారన్నారు. మరో ఐదువందల మంది ఈ పనులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నట్టు చెప్పారు. నిర్మాణ పనులకు ఇసుక సక్రమంగా అందక పనులు నిలిచిపోవడంతో భవన నిర్మాణ కార్మికులు ఉపాధికి దూరమవుతున్నారన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు నమ్మినాగరాజు, మాలిబాబు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సారా, మద్యంతో పలువురి అరెస్టు

రావికమతం/ గొలుగొండ/రోలుగుంట, మార్చి27 : నాటు సారా తయారు చేసి, విక్రయానికి సిద్ధంగా ఉంచిన వ్యక్తిని పట్టుకుని అరెస్టు చేసినట్టు ఎస్ఐ ధనుంజనాయుడు తెలిపారు. గడబపాలెంలో బుధవారం ఉదయం సిబ్బందితో కలిసి దాడులు నిర్వహిస్తుండగా, ఓ వ్యక్తి సారాతో పట్టుబడినట్టు చెప్పారు. అలాగే, ఎనిమిది వందల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు. ఇదివుంటే, గొలుగొండ మండలంలోని రెండు గ్రామాల్లో మద్యం, సారాతో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ కృష్ణారావు తెలిపారు. ఐదు లీటర్ల నాటుసారాను విక్రయించేందుకు తీసుకు వెళుతుండగా జోగంపేటకు చెందిన నంబూరి శ్రీనుబాబును, ఎర్రవరంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న అమరపల్లి వెంకటరమణను పదకొండు మద్యం బాటిళ్లతో పట్టుకుని అరెస్టు చేసినట్టు చెప్పారు. రోలుగుంట మండలం గుర్రాలపాలెంలో బుధవారం సారా బట్టీపై దాడి చేసి వెయ్యి లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్టు సెబ్ ఇన్‌స్పెక్టర్ కె.సునీల్ కుమార్ తెలిపారు.

'పట్నం' రహదారి విస్తరణ అస్తవ్యస్తం

... 5వ పేజీ తరువాయి

అధికంగా ఉన్న అబీద్ సెంటర్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం 100 అడుగులు రోడ్డు విస్తరణ చేయాలని ఎమ్మెల్యే భావించారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరులో జాప్యం కారణంగా నిర్మాణ పనులు అస్తవ్యస్తంగా సాగుతున్నాయి.

కాంట్రాక్టర్‌కు రూ.3 కోట్లు బకాయిలు!

అబీద్ సెంటర్ నుంచి పెదబొడ్డేపల్లి మదుం వరకు 1800 మీటర్ల రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులు చేపట్టవలసి ఉండగా, 8 నెలల వ్యవధిలో కేవలం 265 మీటర్ల రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. అబీద్ సెంటర్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు 265 మీటర్లు వరకు బీటీ రోడ్డు వేయడానికి ఏర్పాట్లు చేశారు. అయితే కాంట్రాక్టరుకు రూ.3 కోట్లు బకాయిలు విడుదల కాకపోవడంతో తారు వేయలేదని సమాచారం. డివైడర్ల నిర్మాణం పూర్తి చేసి సెంటర్ లైటింగ్ కోసం స్తంభాలు ఏర్పాటు చేశారు. డివైడర్ మధ్యలో మొక్కలు వేయడానికి మట్టి వేశారు. డ్రైనేజీ ల నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. స్వామి అయ్యప్ప గుడి కమిటీ, సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ప్రైవేటు భవన యజమానులు కోర్టుకు వెళ్లి స్టే తీసుకురావడంతో ఆయా చోట్ల డ్రైనేజీ పనులు నిలిచిపోయాయి. మిగిలిన 500 మీటర్లు డ్రైనేజీ పనులు పూర్తి చేసి కవర్ శ్లాబ్‌లు కూడా పూర్తి చేశారు. అదే విధంగా పెదబొడ్డేపల్లి మదుం దగ్గర నుంచి 200 మీటర్లు వరకు డ్రైనేజీ పనులు పూర్తి చేశారు. కోర్టును ఆశ్రయించిన భవన యజమానుల ఆస్తులు ఉన్న చోట డ్రైనేజీ పనులు ఆపేసి, రోడ్డు విస్తరణకు అంగీకరించిన భవన యజమానుల ఆస్తులు ముందు డ్రైనేజీ పనులు చేపడుతున్నారు. దీంతో డ్రైనేజీ పనులు అస్తవ్యస్తంగా జరుగుతున్నాయి. ఇప్పటి వరకు కాంట్రాక్టరు చేపట్టిన పనులకు ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయలేదు. కాంట్రాక్టరుకు బిల్లులు విడుదల చేస్తే గాని బీటీ రోడ్డు పూర్తి చేసే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికైనా ఎమ్మెల్యే ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు విస్తరణ పనులు పూర్తికావడానికి చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

నీటి ప్రాజెక్టులను గాలికొదిలేశారు !

... 5వ పేజీ తరువాయి

ప్రభుత్వం తన వాటాగా 15 శాతం ఇవ్వాలి. అయితే రాష్ట్ర ప్రభుత్వం తన వాటా సొమ్ము విడుదల చేయకపోవడంతో ప్రాజెక్టు ఆధునికీకరణ పనులు మధ్యలో నిలిచిపోయాయి. అలాగే కోనాం రిజర్వాయర్, కాలువల నిర్వహణ, మరమ్మతులకు 2019-20 నుంచి 2022-23 వరకు రూ.80.86 లక్షలు, పెద్దేరుకు రూ.2.65 లక్షలు మాత్రమే కేటాయించారు. అవి కూడా విడుదల చేయలేదు. ప్రభుత్వ నిధులతో సంబంధం లేకుండా ప్రాజెక్టుల నిర్వహణ అంటే జనరేటర్‌కు డీజిల్, గేట్లకు గ్రీజు, విద్యుత్ బిల్లులు, ఇతరత్రా ఖర్చులకు అప్పులు చేయాల్సి వచ్చింది. పెద్దేరు రిజర్వాయర్ నుంచి అదనపు ఆయకట్టుకు నీరందించేందుకు రూ.9.12 కోట్లతో పనులు చేపట్టాలని గత ఏడాది ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే ప్రాజెక్టు కాలువల ఆధునికీకరణ పనులకు గత ఏడాది రూ.84.4 కోట్ల మంజూరుకు ప్రభుత్వం ఆమోదం తెలపడంతో టెండర్లు పిలవగా ఒకరు వచ్చారు.

చిన్న చెరువుల అభివృద్ధిపై నిర్లక్ష్యం

ప్రపంచ బ్యాంకు ఆర్థిక సాయంతో ఆంధ్రప్రదేశ్ సమీకృత సేద్య, వ్యవసాయ పరివర్తన ప్రాజెక్టు (ఏపీఐఐఏటీపీ) కింద ఉమ్మడి జిల్లాలో రూ.33.46 కోట్లతో 50 చెరువుల పునరుద్ధరణకు ఆమోదం లభించింది. ప్రపంచ బ్యాంకు 70 శాతం నిధులు మంజూరుచేయగా, రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం వాటాగా ఇవ్వాల్సి ఉంది. మొదట 33 చెరువులకు సంబంధించి 13 పనులకు రూ.20.84 కోట్లతో టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు అప్పగించారు. అయితే ఇప్పటివరకు కేవలం రూ.1.93 కోట్ల విలువైన పనులు పూర్తి చేయగా రూ.1.29 కోట్లు బిల్లులు మంజూరుచేశారు. అవి కూడా 2022లో బిల్లులు అప్‌లోడ్ చేయగా 2023లో ఖాతాలకు జమ అయ్యాయి. దీంతో పద్మనాభం మండలం రేవిడి గ్రామంలో యానాద్రి చెరువు, దేవరాపల్లి మండలం ముసిడిపల్లెలో మాటలవాని చెరువు, నాగరాయుడు చెరువు, తెనుగుపూడిలో రాజుచెరువు పనులు సగంలో నిలిచిపోయాయి. కాగా ప్రపంచ బ్యాంకుతో చేపట్టాల్సి ఉన్న మిగిలిన 17 చెరువుల అభివృద్ధికి కాంట్రాక్టర్లు చేసుకున్న ఒప్పందాలు రద్దు చేసుకున్నారు. ఇదిలావుండగా శారదా నదిపై పలుచోట్ల గ్రోయిన్లకు ప్రత్యామ్నాయంగా చెక్‌డ్యామ్‌లు నిర్మించాలన్న ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదు. జిల్లాల విభజనతో విశాఖలో ఉన్న జల వనరుల శాఖ ఈఈ కార్యాలయాన్ని నర్సీపట్నానికి తరలించారు. గత ఏడాది అక్టోబరు నెలాఖరున ఈఈ శ్రీనివాసరావు స్వచ్ఛంద పదవీ విరమణ చేయగా అప్పటి నుంచి నర్సీపట్నం డీఈ ఇన్‌చార్జిగా ఉన్నారు. అయినా ఉన్న సిబ్బందికే పని లేదు. ఇదిలావుండగా రానున్న ఖరీఫ్ నాటికి ప్రాజెక్టులు, కాల్వలను సిద్ధం చేయాల్సి ఉన్నా అధికారులు వాటి సంగతే మరిచిపోయారు. నిధుల కోసం కొత్తగా ప్రతిపాదనలు పంపవద్దని గత ఏడాది ప్రభుత్వం ఆదేశించింది.

పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం

» ఓ వైపు దోమల బెడద.. మరో వైపు దుర్వాసన » కొన్నిచోట్ల రోడ్ల పక్కన, చెరువు గట్లపై చెత్తాచెదారం

» క్షేత్ర స్థాయిలో కార్యదర్శుల పర్యవేక్షణ శూన్యం » అవస్థలు పడుతున్న జనం » వెంటాడుతున్న అంటు వ్యాధుల భయం



వాకపల్లిలో గ్రామ సచివాలయం ముందు మురుగు



దేవరాపల్లి- జీనబాడు మార్గం శారదా నది గట్టును ఆనుకొని రోడ్డుపై పేరుకుపోయిన చెత్తాచెదారం

దేవరాపల్లి, మార్చి 27 : పల్లెలను పారిశుధ్య సమస్య వీడడం లేదు. మండలంలోని ఏ గ్రామంలో చూసినా ఏదో ఒకచోట చెత్త పేరుకుపోవడమో, కాలువల్లో మురుగు తిష్ఠ వేయడమో వంటి దృశ్యాలు కనిపిస్తూనే ఉన్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో దుర్వాసనతో పాటు దోమల బెడద కూడా అధికంగా ఉంటోంది. ఫలితంగా అంటువ్యాధుల భయం వెంటాడుతోంది. అయినప్పటికీ పట్టించుకునేవారు కరువయ్యారు. ఎక్కడైనా అతిసార, డెంగ్యూ వంటి కేసులు నమోదైనట్టు నిర్ధారణ జరిగినప్పుడు మాత్రమే ఆయా పంచాయతీల అధికారులు పారిశుధ్య పనులు, బ్లీచింగ్ చల్లడం, స్ప్రేయింగ్ చేయడం వంటివి చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. వాకపల్లిలో సచివాలయ భవనం ముందే మురుగు చిన్నపాటి చెరువును తలపించేలా ఉన్నా సంబంధిత అధికారుల్లో చలనం లేకపోవడం గమనార్హంగా పేర్కొంటున్నారు. గ్రామాల్లోని చాలామంది సామాజిక బాధ్యతగా చెత్తాచెదారాన్ని డస్టుబిన్‌లలో వేయడం, పారిశుధ్య సిబ్బందికి అప్పగించడం వంటివి చేయడం లేదని అంటున్నారు. దీనివల్లే ఇటువంటి సమస్యలు తలెత్తుతున్నట్టు వాపోతున్నారు. మండలంలో 27 గ్రామ పంచాయతీలు, 20 సచివాలయాలు ఉన్నాయి. సచివాలయానికి వెళ్లిన పంచాయతీ కార్యదర్శుల్లో పలువురు ముఖ హాజరు వేసిన తరువాత సొంత పనులపై వెళ్లిపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కనీసం పలు గ్రామ సచివాలయాల ముందు, వెనుక చెత్తాచెదారం ఉన్నా పట్టించుకోవడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే గ్రామాలకు వెళ్లే రోడ్లలో చెత్తకుప్పలు దర్శనమిస్తున్నా కన్నెత్తి చూసేవారు కరువవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుధ్య సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాల్సిందిగా పలువురు కోరుతున్నారు.

చీడిపల్లి మెయిన్ రోడ్డుపై మురుగు తిష్ఠ



చీడిపల్లిలో రోడుపైకి చేరి వాడుక నీరు

చీడికాడ, మార్చి 27 : మండలంలోని చీడిపల్లిలో రోడ్డుపైకి మురుగు చేరుతుండడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మాడుగుల నుంచి ఖండివరం, చీడికాడ, తురువోలు, చీడిపల్లి మీదుగా వాకపల్లి, తారువ గ్రామాలకు వెళ్లేవారితో ఈ రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. దేవరాపల్లి వెళ్లేవారికి కూడా ఇదే ప్రధాన రహదారి. చీడిపల్లిలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పలువురు గృహ యజమానులు రోడ్డును ఆక్రమించడంతో ఆ ప్రదేశంలో ఎదురెదురుగా వస్తున్న వాహనదారులు ఇబ్బందులు పడక తప్పడం లేదు. ఈ రోడ్డు గృహాలకు దిగువున ఉండడంతో వాడుక నీరు వచ్చి చేరుతోంది. వర్షాల సమయంలోనూ ఇక్కడ చెరువును తలపించేలా నీరు నిలిచిపోతుంది. దీంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. నీరు నిలిచిపోతుండడంతో దోమల బెడద అధికంగా ఉందని ఆయా ప్రాంతాల వారు వాపోతున్నారు. అధికారులు స్పందించి మురుగునీరు నిల్వలేకుండా చర్యలు చేపట్టాల్సిందిగా అక్కడివారంతా కోరుతున్నారు.



వర్షాలు కురిస్తే రహదారి దుస్థితి ఇలా (ఫైల్)

చంద్రబాబుతోనే గ్రామాల అభివృద్ధి

» పైడిపాల ఎన్నికల శంఖారావం సభలో అయ్యన్న



పైడిపాలలో మాట్లాడుతున్న అయ్యన్నపాత్రుడు

మాకవరపాలెం, మార్చి 27 : వైసీపీ ఐదేళ్ల పాలనలో గ్రామాలపై నిర్లక్ష్యం చూపడంతో ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోయాయని మాజీ మంత్రి, నర్సీపట్నం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. మళ్లీ పల్లెలు ప్రగతి సాధించాలంటే చంద్రబాబు వంటి సమర్థనాయకుడి వల్లే సాధ్యమన్నారు. మండలంలోని పైడిపాలలో బుధవారం ఎన్నికల శంఖారావం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్‌రెడ్డి గత ఎన్నికల్లో ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారన్నారు. వీటిని నెరవేర్చకపోవడంతో అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. రైతుల భూములకు సంబంధించి పత్రాలపై జగన్‌రెడ్డి ఫొటో ఎందుకని ప్రశ్నించారు. దీనివల్ల రైతులు బ్యాంకు రుణాలు పొందేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ ఎన్నికల్లో తనను గెలిపించాల్సిందిగా కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు ఆర్.వై.పాత్రుడు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వీర సూర్యచంద్ర, బీజేపీ మండల అధ్యక్షుడు మత్రినాయుడు, యువమోర్చా నాయకుడు రాంబాబు, టీడీపీ నాయకులు శ్రీను, శేషుకుమార్, గోవింద తదితరులు పాల్గొన్నారు.

'స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోండి'



ఎంబీపట్నంలో మాట్లాడుతున్న ఎస్ఐ రామారావు

నాతవరం, మార్చి 27 : సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలని ఎస్ఐ రామారావు కోరారు. మండలంలోని ఎంబీపట్నంలో మంగళవారం రాత్రి ఆయన పల్లెనిద్ర చేశారు. అంతకుముందు గ్రామస్థులతో ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల నియమావళిని అంతా విధిగా పాటించాలన్నారు. ఎక్కడైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగితే చట్టపరంగా చర్యలు తప్పవన్నారు. ఈ సమావేశంలో పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అమలాపురంలో వైసీపీ అభ్యర్థి గణేశ్ ప్రచారం

నర్సీపట్నం అర్బన్, మార్చి 27 : మండలంలోని అమలాపురం గ్రామంలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పెట్ల ఉమాశంకర్‌గణేశ్ ఎన్నిక ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న వైసీపీని ఎన్నికల్లో అంతా గెలిపించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుర్ల రాజేశ్వరితో పాటు పలువురు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

'రాష్ట్రాభివృద్ధిని చూసి గెలిపించండి'

కె.కోటపాడు, మార్చి 27 : గత ఐదేళ్లలో రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి పనులను చూసి వైసీపీ మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉన్న తనను, అనకాపల్లి ఎంపీగా పోటీచేస్తున్న తన తండ్రి బూడి ముత్యాలనాయుడును గెలిపించాల్సిందిగా ఈర్లె అనూరాధ కోరారు. బుధవారం ఆమె ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ శ్రేణులంతా ఈ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర భవిష్యత్తుకు టీడీపీని గెలిపించండి

» ఎన్నికల ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు



టీడీపీలో చేరినవారితో మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, మార్చి 27 : రాష్ట్ర భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ చంద్రబాబు నాయకత్వంలోని కూటమికి అధికారం కల్పించాలని చోడవరం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని వెలమవీధి తదితర ప్రాంతాల్లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల కోసం చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. వీటితో రాష్ట్ర ప్రజల కష్టాలు తీరుతాయన్నారు. ఈ ఎన్నికల్లో అరాచక పాలన సాగిస్తున్న జగన్‌కు అంతా ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అనంతరం పార్టీలో చేరిన వెలమ కుటుంబాలకు ఆయన కండువాలు కప్పి ఆహ్వానించారు. రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి వెంకట అప్పారావు తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు

» కార్యదర్శుల సమావేశంలో ఎంపీడీవో రాంబాబు ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రాంబాబు

నాతవరం, మార్చి 27 : వేసవిలో గ్రామాల్లో తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా పంచాయతీల కార్యదర్శులు ముందు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో జె.రాంబాబు ఆదేశించారు. బుధవారం ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో ఏర్పాటైన సమావేశం మాట్లాడారు. ఎక్కడెక్కడ కుళాయిలు పాడయ్యాయో గుర్తించి మరమ్మతులు చేపట్టాలన్నారు. జనసంచారం ఎక్కువగా ఉండేచోట చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. వృద్ధులు ఎండలో తిరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏఎన్ఎంలు అవగాహన కల్పించాలన్నారు. అలాగే ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న కూలీలు ఎండ బారిన పడకుండా తొందరగా పనులు ముగించుకునేలా ప్రణాళికలు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన ఏఎస్పీ



ఇన్విజిలేటర్లతో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ

నర్సీపట్నం, మార్చి 27 : పదో తరగతి పరీక్షలు జరుగుతున్న వేములపూడి జడ్పీహెచ్ పాఠశాలను జిల్లా అదనపు ఎస్పీ పి.సత్యనారాయణ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇన్విజిలేటర్లతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట పలువురు అధికారులు ఉన్నారు.

చీడికాడ : పదో తరగతి పరీక్షలు మండలంలో బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. పదకొండు హైస్కూళ్లకు చెందిన విద్యార్థులు కోనాం, మంచాల, చీడికాడ, కేంద్రాల్లో పరీక్షలు రాశారు. ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేసినట్టు ఎంఈవో బొంజుబాబు బుధవారం తెలిపారు.

'పాన్‌షాపుల్లో మద్యం విక్రయిస్తే చర్యలు'



పప్పుశెట్టిపాలెంలో మాట్లాడుతున్న సీఐ

గొలుగొండ , మార్చి 27 : పాన్ షాపుల్లో మద్యం విక్రయాలు చేపడితే చర్యలు తప్పవని జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం సీఐ మేరా సాహెబ్ హెచ్చరించారు. మండలంలోని పప్పుశెట్టిపాలెం, నర్సింగబిల్లి తదితర గ్రామాల్లోని పలు పాన్‌షాపుల్లో బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్టు షాపులు నిహించేవారిపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ ఎస్ఈబీ ఎస్ఐ రహీమ్, సిబ్బంది పాల్గొన్నారు.

భవనం కోసం ఆర్డీవోకు దివ్యాంగుల వినతి



ఆర్డీవోకు వినతిని అందిస్తున్న దివ్యాంగులు

నర్సీపట్నం అర్బన్ , మార్చి 27 : మాకవరపాలెం మండలంలోని దివ్యాంగులకు భవనం కేటాయించాలని మ్యూచువల్ ఎయిడెడ్ సహకార సంస్థ సభ్యుడు టి.సతీష్ నర్సీపట్నం ఆర్డీవో జయరాంను కోరారు. ఈ మేరకు ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. గ్రామంలోని 150 మంది దివ్యాంగులతో కలిసి సొసైటీని ఏర్పాటు చేశామన్నారు. చేతివృత్తులు నిర్వహించుకునేందుకు వీలుగా ప్రస్తుతం ఖాళీగా ఉన్న తారా సంస్థ నిర్వహిస్తున్న భవనాన్ని తమకు కేటాయించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

ఇటుక బట్టీలో కార్మికులకు వైద్య సేవలు

బుచ్చెయ్యపేట, మార్చి 27 : నీలకంఠాపురంలోని ఇటుక బట్టీలలో పనిచేస్తున్న ఒడిశాకు చెందిన కార్మికులకు బుధవారం తురకలపూడి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో గర్భిణులకు అవసరమైన మందులు అందజేశారు. వేసవిలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి అవగాహన కల్పించారు. ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా పీహెచ్‌సీ, ఉప కేంద్రాల్లో వైద్య సేవలు పొందాల్సిందిగా సూచించారు.

ఆడ పిల్లల సంక్షణపై ఐసీడీఎస్ ర్యాలీ


కె.కోటపాడు, మార్చి 27 : మండల కేంద్రం కె.కోటపాడులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం 'ఆడ పిల్లలను బతికిద్దాం- ఆడ పిల్లలను చదివిద్దాం' నినాదంతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీడీపీవో మంగతాయారు మాట్లాడుతూ బాల్య వివాహాల నియంత్రణకు అంతా కృషి చేయాలన్నారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి డి.లోవరాజు, సూపర్‌వైజర్లు సుశీల, కళ్యాణి, ఆదిలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కార్పెంటర్ల సమస్యలను పరిష్కరించాలి



నర్సీపట్నం మెయిన్ రోడ్డులో ర్యాలీ చేస్తున్న కార్పెంటర్లు

నర్సీపట్నం, మార్చి 27 : కార్పెంటర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు పి.చంద్రశేఖర్‌రావు డిమాండ్ చేశారు. కార్పెంటర్స్ డే సందర్భంగా బుధవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పెంటర్ వృత్తి చేస్తూ మిషనరీ వద్ద జరిగిన ప్రమాదాలలో అంగవైకల్యం పొందిన వారికి బీమా సౌకర్యం కల్పించాలన్నారు, వృత్తిపని చేయలేని వారికి పెన్షన్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు సీహెచ్.ఆనంద్, పి.మహేశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.



కృష్ణాదేవిపేట పీహెచ్‌సీ వద్దకు ర్యాలీగా వెళ్లిన కార్పెంటర్లతో వైద్య సిబ్బంది

కృష్ణాదేవి పేట : గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలో కార్పెంటర్ల డేను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లకార్డులు చేతబట్టి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం నుంచి ప్రధాన రహదారిలో కార్పెంటర్లు ర్యాలీ చేపట్టారు. అనంతరం పీహెచ్‌సీలో చెక్క తలుపులకు ఉచితంగా మరమ్మతులు చేసి, మందులు వేసేందుకు అనువుగా ఉండే చెక్కతో కూడిన తొట్టెను తయారు చేసి వైద్యాధికారులు హరిప్రవీణ్, గాయత్రిలకు అందజేశారు. తాము ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో కామాక్షి వీరబ్రహ్మేంద్రస్వామి వడ్రంగి పనివార్ల సంఘం ప్రతినిధులతో పాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు.